


నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
శనివారం
23-05-2026 సంపుటి : 01 సంచిక : 62 పేజీలు : 08 వెల : ₹ 5/-
తెలుగు దినపత్రిక




Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com




## ఉప్పల్‌లో సన్‌రైజర్స్ జయభేరి..

### ఆర్‌సీబీపై 55 పరుగుల తేడాతో ఘన విజయం

- ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, క్లాసెన్ హాఫ్ సెంచరీల విధ్వంసం
- మెరుగైన రన్‌రేట్‌తో క్వాలిఫయర్ 1కు చేరిన ఆర్‌సీబీ, గుజరాత్ టైటాన్స్

న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )
భారీ విజయంతో క్వాలిఫయర్ 1 ఆడాలనుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆశలపై ఆర్సీబీ నీళ్లు చల్లింది. ఉప్పల్‌లో 256 పరుగులు ఛేదనలో ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(44) అదిరే ఆరంభమివ్వగా.. కృనాల్ పాండ్యా(41 నాటౌట్) జతగా పటిదార్(56) కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. సన్‌రైజర్స్ బౌలర్లు గొప్పగా రాణించినా ఆర్సీబీని 165లోపు కట్టడి చేయలేకపోయారు. దాంతో..

-మిగతా 3 లో



3 లో

## భారత్‌లో భానుడి భగభగలు..

- ప్రపంచంలో టాప్-50 వేడి నగరాలు ఇక్కడే
- మధ్య భారత్‌లో వడగాలుల తీవ్రత ఎక్కువ



## పెద్దల ఎన్నికకు.. నగారా!

- 24 రాజ్యసభ స్థానాలకు ఈసీ నోటిఫికేషన్
- ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నిక
- జూన్ 1 నుంచి నామినేషన్ల స్వీకరణ
- 18న పోలింగ్, అదే రోజు కౌంటింగ్

న్యూఢిల్లీ, మే 22 ( మహాప్రభ )
దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ఖాళీ కానున్న 24 రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని 4 స్థానాలతో పాటు గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో జూన్ 18న పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు ఓట్లు లెక్కిస్తారు. జూన్ 1న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ కాగా జూన్ 9న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. జూన్ 10వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని వివరించింది. జూన్ 18వ తేదీన ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామంది. అదే రోజు కౌంటింగ్ నిర్వహించి.. ఫలితాన్ని ప్రకటిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గుజరాత్‌లో 4, కర్ణాటకలో 4, మధ్యప్రదేశ్‌లో 3, రాజస్థాన్‌లో 3, జార్ఖండ్‌లో 2 స్థానాలతో పాటు మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, మిజోరంలో ఒక్కో

-మిగతా 3 లో

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం


### తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం

- దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
- రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు వడ్డీ లేని రుణాలు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ మే 22 ( మహాప్రభ )
సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని ప్రకటించారు. ఇందుకోసం ప్రజా ప్రభుత్వం

-మిగతా 3 లో




3 లో

## కండోమ్‌ల ఉత్పత్తిపై యుద్ధ ప్రభావం..


ధరలు పెరిగే అవకాశం!



3 లో

## నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

వేద పాఠశాలకు భూమిపూజ



## భారత్, సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

- సంబంధాలు పెంచుకునేలా కొత్త వేగం అందించడానికి రెడీ
- ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్
- ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్న అనుబంధం
- సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోడీ
- భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం- భారత్‌కు మద్దతు : సైప్రస్

న్యూఢిల్లీ :మే 22 ( మహాప్రభ )
భారత్, సైప్రస్ తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెల్లడించారు. భారత్, సైప్రస్ అనుబంధం కాలపరీక్షలో పదేపదే నిలుస్తూ వచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పుడు భారత్-సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుతో ఇరుదేశాల సంబంధాలకు కొత్త ఆశయాలు, కొత్త వేగాన్ని అందించడానికి సిద్ధమయ్యామని చెప్పారు. మే 20 నుంచి భారత పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్, శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఈ ద్వైపాక్షిక సమావేశం అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో భారత ప్రధాని ప్రసంగించారు.గత దశాబ్ద కాలంలో భారత్‌లోకి సైప్రస్ పెట్టుబడులు

-మిగతా 3 లో



## పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

- మిగతా వారికి కూడా ఈప్రయోజనం అందవద్దా
- ఐఎఎస్ తల్లిదండ్రుల పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా
- కొందరికే రిజర్వేషన్లు దక్కితే మిగతా ప్రజలు ఏం కాను
- ఇలా అయితే దేశంలో రిజర్వేషన్ల నుంచి బయటపడేనా
- సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు

3




# రైతు గోస పట్టదా?

### కల్లాల్లోనే చనిపోతున్నా పంట కొనరా?


సర్కార్‌ను నిలదీసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

- ధాన్యం కొనుగోలు చేయాలని సచివాలయం వద్ద టీఆర్ఎస్ ధర్నా
- అక్కడే బైఠాయించిన కవిత
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- అరెస్ట్ చేసి ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌కు తరలింపు

హైదరాబాద్, మే 22 ( మహాప్రభ )
ప్రభుత్వానికి రైతు గోస పట్టదా? మండుతున్న ఎండలతో వడదెబ్బకు గురై కల్లాల్లోనే రైతన్నలు ఊపిరి వదులుతున్నా పంటలు కొనుగోలు చేయరా? అంటూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత సర్కార్‌ను నిలదీశారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ

-మిగతా 3 లో






## గల్ఫ్‌లో ఉన్న వారి ఓట్లు పోకుండా చూస్తాం

- కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా కలుస్తాం
- బీఎల్‌ఏల సహకారంతో అందరి ఓటు హక్కును కాపాడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ మే 22 ( మహాప్రభ )
సర్ పేరుతో గల్ఫ్‌లో ఉన్న తెలంగాణ వారి ఓట్లు పోకుండా చూస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. బీఆర్ఎస్ తరఫున నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) సహకారంతో ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడుతామని చెప్పారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో పార్టీ సమీక్ష సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్ కేటీఆర్

-మిగతా 3 లో

# బెంగాల్‌లో భారీ సంఖ్యలో బాంబులు గుర్తింపు..

**-స్థానికుల్లో భయాందోళన**



**కోల్‌కతా మే 22 ( మహాప్రభ )**
పశ్చిమ బెంగాల్‌లో భారీ సంఖ్యలో నాటు బాంబులను స్థానికులు గుర్తించారు. ఒక తోటలో 31 బాంబులు పేర్చి ఉండటం చూసి భయాందోళన చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం కోట్ గ్రామం చెరువు గట్టు సమీపంలోని వెదురు తోట వద్ద 31 నాటు బాంబులు పేర్చి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో ఆ ప్రాంతంలో భయాందోళనలు వ్యాపించాయి.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీస్ బలగాలు అక్కడకు చేరుకున్నాయి. ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. తోటలో పేర్చి ఉంచిన 31 నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని నిర్వీర్యం చేసేందుకు బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌ను పిలిపించారు. ఈ బాంబులను ఎవరు, ఏ ఉద్దేశంతో నిల్వ చేశారో గుర్తించడానికి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే భారీ సంఖ్యలో బాంబులు కనిపించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

# పోలాండ్‌కు 5 వేల మంది సైనికుల్ని పంపుతున్న అమెరికా




**వాషింగ్టన్: మే 22 ( మహాప్రభ )**
యూరోప్‌లో తమ బలగాలను తగ్గిస్తామని ఇన్నాళ్లూ చెప్పిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడు తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు తెలుస్తోంది. పోలాండ్‌కు అదనంగా అయిదు వేల మంది బలగాలను పంపనున్నట్లు ట్రంప్ తాజాగా వెల్లడించారు. దీంతో ఆయన చేస్తున్న ప్రకటనలపై కన్ఫ్యూజన్ నిండిపోయింది. బలగాలను తగ్గించడం కాదు.. పెంచుతున్నట్లు అర్థమవుతోంది. జర్మనీ నుంచి తమ సైనికుల సంఖ్యను తగ్గించనున్నట్లు ఇటీవల ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. జర్మనీ నుంచి సుమారు 5 వేల మందిని ఉపసంహరించనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఇరాన్ వార్‌లో అమెరికా పరాజయాన్ని చవిచూసినట్లు జర్మనీ ఛాన్సలర్ మెర్జ్ ఆరోపించారు. యుద్ధ వ్యూహంలో అమెరికా విఫలమైనట్లు ఆయన విమర్శించారు. కానీ పోలాండ్‌కు మాత్రం అదనంగా బలగాలను పంపనున్నట్లు ట్రంప్ చెప్పడం నాటో దేశాల్లో గందరగోళం నెలకొన్నది. పోలాండ్ అధ్యక్షుడిగా కరోల్ నవరోకీ విజయవంతంగా ఎన్నికయ్యారని, ఆయనకు తన మద్దతు ఉంటుందని, అమెరికా ఆయనకు మద్దతుగా 5 వేల మంది బలగాలను పోలాండ్‌కు పంపుతోందని ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో తెలిపారు.

# సింగపూర్ లో కోవిడ్ కలకలం...!



**సింగపూర్ మే 22 ( మహాప్రభ )**
సింగపూర్‌లో కోవిడ్ కేసులు కలవరపెడుతున్నాయి. ఈ నెల 10 నుంచి 16 మధ్య 12,700 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ఇది అంతకుముందు వారంతో పోలిస్తే 58.8 శాతం గణనీయంగా ఉంది. ఈ కాలంలో ఆస్పత్రులలో చేరే వారి సంఖ్య కూడా 56 నుంచి 73 కు పెరిగింది. అయితే, ఎలాంటి మరణాలు సంభవించలేదని వైద్య వర్గాలు తెలిపాయి. ప్రస్తుత వేరియంట్ ఎన్‌బీ.1.8.1పై వ్యాక్సిన్ సమర్థంగా పనిచేస్తుందని తెలిపాయి.

# త్యాగం పౌరులే చేయాలా?



**న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )**
పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వంటి ధరలు పెరిగి సామాన్యుడిపై భారం పడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పెట్రోల్, డీజిల్‌పై పన్నులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించాలని మక్కల్ నీది మయ్యమ్ పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ డిమాండ్ చేశారు. 'త్యాగాలు చేయడం కేవలం పౌరుల నుంచి మాత్రమే ఆశించాలా? ప్రభుత్వాలు కూడా ఈ భారాన్ని పంచుకోవాలి. అందువల్ల, ముఖ్యమంత్రులందరితో జాతీయ సదస్సును ఏర్పాటు చేయాలని నేను ప్రధానిని కోరుతున్నాను' అని కమల్ హాసన్ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ప్రజలను భారాలను నుండి రక్షించడానికి తక్షణమే పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ వంటి రాష్ట్ర పన్నులను తగ్గించాలి. రెండవది, రైలు, మెట్రో, బస్సు ఛార్జీలను కూడా తగ్గించాలి. తద్వారా ఎక్కువ మంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించరు అని కమల్ హాసన్ వీడియో సందేశంలో అన్నారు.


# ప్రధానికి జల్‌మురి అమ్మిన వ్యాపారికి బెదిరింపులు..

## పాక్, బంగ్లా నుంచి చంపేస్తామంటూ వార్నింగ్



**న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )**
పశ్చిమ బెంగాల్‌లో గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ జల్‌మురి తిన్న సంగతి తెలిసిందే. అయితే, ప్రధానికి ఆ జల్‌మురి ఇచ్చిన వ్యాపారిని చంపేస్తామంటూ ఇప్పుడు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. ఆ వ్యాపారి పేరు విక్రమ్ సాహు. ప్రధాని గత నెల 19న ఎన్నికల ప్రచారం కోసం పశ్చిమ బెంగాల్ వెళ్లారు. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తుండగా, ఝర్‌గ్రామ్ వద్ద కాన్వాయ్ ఆపి, బెంగాల్‌లోని ప్రముఖ ఆహార పదార్థమైన జల్‌మురిని తినేందుకు అక్కడి ఒక చిరు వ్యాపారి దగ్గరకు వెళ్లారు.అతడితో కొద్దిసేపు మాట్లాడి జల్‌మురి కొనుక్కుని తిన్నారు. ఈ అంశం అప్పట్లో బాగా పాపులర్ అయింది. ప్రధాని ఒక సామాన్యుడిలా జల్‌మురి తినడంతో బీజేపీకి బెంగాల్‌లో కొంత సానుకూలత తీసుకొచ్చింది. దీనిపై అప్పటి అధికార టీఎంసీ విమర్శలు చేసింది. ఇదంతా ప్రీ ప్లాన్డ్ డ్రామా అని టీఎంసీ ఆరోపించింది. రాజకీయ లబ్ధి కోసం చేశారని విమర్శించింది. తాను జల్‌మురి తింటేనే భయపడుతున్నారంటూ మోదీ కౌంటర్ ఇచ్చారు. ఆ తర్వాత పలు ర్యాలీల్లోనూ, చివరికి విదేశాల్లోనూ మోదీ జల్‌మురి అంశాన్ని ప్రస్తావించారు. మొత్తానికి మోదీ జల్‌మురి తినడం రాజకీయ అంశంగా మారిపోయింది. మోదీకి జల్‌మురి అమ్మిన వ్యక్తి కూడా ఫేమస్ అయిపోయాడు.ఇప్పుడు ఎన్నికల రిజల్ట్ వచ్చింది. బీజేపీ అధికార చేపట్టింది. టీఎంసీ ఓడిపోయింది. కానీ, జల్‌మురి అమ్మిన విక్రమ్ సాహు మాత్రం బెదిరింపులు ఎదుర్కొంటున్నాడు. అతడిని బాంబులతో చంపేస్తామంటూ పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. దీంతో అతడితోపాటు అతడి కుటుంబం కూడా భయాందోళనకు గురవుతోంది. ఈ బెదిరింపులపై విక్రమ్ సాహూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు కొద్ది రోజుల నుంచి వరుసగా పాక్, బంగ్లాల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయని, తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని విక్రమ్ సాహు చెప్పాడు. ఈ అంశంపై ఇటు బీజేపీ, అటు పోలీసులు ఎలా స్పందిస్తారో చూడాలి.


# ఎవరెస్ట్ దిగుతూ ఇద్దరు భారతీయ పర్వతారోహకులు మృతి



**న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )**
నేపాల్‌లో ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కిన ఇద్దరు భారతీయులు మృతిచెందారు. ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఆ ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు శుక్రవారం తెలిసింది. నేపాల్ పర్వతారోహణ అధికారి రిషి భండారి ఈ విషయాన్ని ఇవాళ వెల్లడించారు. ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో.. ఓ పర్వతారోహకుడు తీవ్రంగా అలసిపోయినట్లు చెప్పారు. అయితే అతని ప్రాణాలను కాపాడేందుకు షెర్పాలు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిపారు. హిల్లరీ స్టెప్ వద్ద అరుణ్ తివారి అనే పర్వతారోహకుడు మృతిచెందినట్లు భండారి చెప్పారు. సందీప్ ఆరె అనే వ్యక్తి రెండో క్యాంప్ వద్ద ప్రాణాలు కోల్పోయాడు.

**కామి రీటా అభ్యర్థన..**
ఎవరెస్ట్‌ను అత్యధికంగా 32 సార్లు అధిరోహించిన నేపాలీ షెర్పా కామి రీటా శుక్రవారం అభ్యర్థన చేశారు. 8849 మీటర్ల ఎత్తైన ఎవరెస్ట్‌ను ఎక్కేందుకు పర్వతారోహకులు అధిక సంఖ్యలో వస్తున్నారని, దీని వల్ల ఆ కొండ రద్దీగా మారినట్లు ఆయన తెలిపారు. అయితే పర్వతారోహకుల సంఖ్యపై నియంత్రణ పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈసారి చైనా వైపు నుంచి ఎవరెస్ట్ ఎక్కేందుకు అనుమతి లేకపోవడంతో.. నేపాల్ వైపు నుంచి భారీ సంఖ్యలో పర్వతారోహకులు రిజిస్టర్ చేసుకున్నారు. బుధవారం ఒక్క రోజే నేపాల్ వైపు నుంచి 274 మంది క్లైంబర్లు ఎవరెస్ట్ చేసుకున్నారు. ఈసారి మొత్తం 494 మంది పర్వతారోహకులకు నేపాల్ అధికారులు పర్మిషన్ ఇచ్చారు.
పర్వతారోహకులకు సరిపడ షెర్పాలు ఉన్నా.. ఎవరెస్ట్ పర్వతం రద్దీగా మారిపోయిందని కామి రీటా అన్నారు. అధికారులు క్లైంబర్ల సంఖ్యను కంట్రోల్ చేయాలన్నారు. ఎవరెస్ట్ శిఖరంపై రోప్ మార్గంలో ట్రాఫిక్ జామ్ కావడం వల్ల.. ఆ పర్వతారోహకులు అధిక సమయం కఠినమైన వాతావరణంలో గడపాల్సి వస్తోందని, దీని వల్ల వాళ్ల ప్రాణాలు ఇబ్బందుల్లో పడుతున్నాయన్నారు. కామి రీటాతో పోటీపడుతున్న పసాంగ్ దవా షెర్పా ఇప్పటికే ఎవరెస్ట్‌ను 31 సార్లు అధిరోహించారు.

# ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో భారత్ లోనే 50



**న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )**
ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల జాబితాలో 50 నగరాలు భారత్ లోనే ఉన్నట్లు నివేదిక తెలిపింది. శుక్రవారం ఉదయం 10.50 గంటలకు ఈ 50 నగరాల్లో ఉష్ణోగ్రత 43 డిగ్రీలుగా నమోదైనట్లు వాయు నాణ్యత, వాతావరణ సూచిక (ఎక్యూఐ) తెలిపింది. దేశంలోని ఉత్తర, మధ్య మరియు తూర్పు ప్రాంతాలలో తీవ్రమైన వడగాలులు విజృంభించడంతో.. మధ్యాహ్నానికి ముందే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటిపోయినట్లు నివేదిక తెలిపింది. ఒడిశాలోని బలాంగిర్ 45డిగ్రీల ఉష్ణోగ్రతతో అత్యంత వేడి ప్రాంతంగా నిలిచింది. ఆ తర్వాత 44డిగ్రీల ఉష్ణోగ్రతతో చంద్రాపూర్, ప్రయాగ్‌రాజ్‌లతో పాటు ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్‌లలోని పలు నగరాలు నిలిచాయి. అయితే ఈ జాబితాలో సగానికి పైగా నగరాలు ఉత్తరప్రదేశ్ లోనే ఉండటం గమనార్హం. వారణాసి, బందా, బరేలీ, అయోధ్యల్లో మధ్యాహ్నానికి ముందే ఉష్ణోగ్రతలు 42డిగ్రీల నుండి 43 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ఎపి, తెలంగాణల్లో భీమవరం, ఆదిలాబాద్, జగిత్యాలలు ఈ జాబితాలో నిలిచాయి. వాయువ్య, మధ్య భారతదేశ వ్యాప్తంగా వారంరోజుల పాటు తీవ్రమైన వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో పలు రాష్ట్రాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లను జారీ చేసింది.

---

# కేంద్రానికి ఆర్‌బిఐ శుభవార్త

**రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ ప్రకటన**



**న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )**
కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు, కమీషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు-రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు-పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు- తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు. ఈ మిగులు నిధులను కేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది. ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.3.16 లక్షల కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.

# అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతం



**న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )**
స్వల్పశ్రేణి లక్ష్యాలను ఛేదించే అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని చాందీపూర్‌లోనున్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వ్యూహాత్మక దళాల కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారంనాడు ఈ క్షిపణ పరీక్ష జరిగింది. ఉపరితలం నుంచి ఉపరితలం పైకి దాడి చేసే స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి పరీక్షను ఎస్ఎఫ్‌సీ విజయవంతంగా ప్రయోగించి నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షతో అన్ని కార్యాచరణ, సాంకేతిక పరిమితులను విజయవంతంగా ధ్రువీకరించినట్టు పేర్కొంది. గత ఏడాది జూలైలోనూ ఇదేతరహా పరీక్షను డీఆర్‌డీఓ విజయవంతంగా నిర్వహించింది. ఈ క్షిపణి 700 నుంచి 1,200 కిలోమీటర్ల లక్షాలను సునాయాసంగా ఛేదించగలదు. అణ్వాయుధాలను మోసుకెళ్లే శక్తివంతమైన క్షిపణిగా దీనిని డీఆర్‌డీఓ అభివృద్ధి చేసింది. కాగా, ఈనెల మే 8న అడ్వాన్స్ అగ్ని మిజైల్‌ను ఒడిస్సాలోని అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఇండియా విజయవంతంగా పరీక్ష చేసింది. మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటెడ్ రీ-ఎంట్రీ వెహికల్ సిస్టమ్ (ఎంఐఆర్‌వీ)తో ఈ క్షిపణి పరీక్ష నిర్వహించారు. వేర్వేరు ప్రదేశాల్లో ఉన్న బహుళ లక్ష్యాలను ఈ క్షిపణి విజయవంతంగా ఛేదించింది. ఇండియాకు పెరుగుతున్న ముప్పు అవకాశాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సన్నద్ధతను ఎంఐఆర్‌వీ చాటిచెప్పిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీఓను ప్రశంసించారు.

# ఉప్పల్‌లో సన్‌రైజర్స్ జయభేరి..

మొదటి తరువాయి




హైదరాబాద్ మూడో స్థానానికే పరిమితమైంది. ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్‌కు బౌలర్లు భారీ స్కోర్ సమర్పించుకోగా.. ఆర్సీబీకి ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(44) అదిరే ఆరంభమిచ్చాడు. శివాంగ్ ఓవర్లో మూడు సిక్సర్లు, ఫోర్‌తో ఏకంగా 23 పరుగులు పిండుకున్నాడు. ప్రమాదకరంగా మారిన అయ్యర్‌ను మలింగ బోల్తా కొట్టించాడు. సిక్సర్‌కు యత్నించిన అయ్యర్ మిడాన్‌లో అభిషేక్ చేతికి చిక్కాడు. కాసేపటికే షకీబ్ ఓవర్లో కవర్స్‌లో ఆడిన విరాట్ కోహ్లీ(15) స్మరణ్ చేతికి చిక్కాడు. దాంతో. పవర్ ప్లేలో ఆర్సీబీ 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. కీలక వికెట్లు పడడంతో పడిక్కల్, పటిదార్ ఇన్నింగ్స్ నిర్మించాలనుకున్నారు.
కానీ, పడిక్కల్‌ను ఔట్ చేసి రెండో వికెట్ సాధించాడు మలింగ. ఆ తర్వాత కృనాల్ పాండ్యా(41 నాటౌట్) జతగా పటిదార్(56) .. సన్‌రైజర్స్ క్వాలిఫయర్ 1 అవకాశాల్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఆడాడు. పెద్ద షాట్లకు వెళ్లకుండావికెట్ కాపాడుకుంటూ స్ట్రయిక్ రొటేట్ చేశారు. పార్ట్ టైమ్ బౌలర్ హెడ్ ఓవర్లో పాటిదార్ పెద్ద షాట్ ఆడి బౌండరీ వద్ద చిక్కాడు. 55 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ జయభేరి మోగించింది.


**ఇషాన్, క్లాసెన్ దంచేయగా**

క్వాలిఫయర్ 1 పై కన్నేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ టాపార్డర్ విధ్వంసంతో కొండంత స్కోర్ కొట్టింది. ఉప్పల్ స్టేడియంలో అభిషేక్ శర్మ(56) మెరుపు ఆరంభాన్నివ్వగా.. ఇషాన్ కిషన్(79), క్లాసెన్(51) జోడీ తర్ధ శతకాలతో ఆర్సీబీ బౌలర్ల భరతం పట్టింది. వీరిద్దరూ శతక భాగస్వామ్యం నెలకొల్పగా.. డెత్ ఓవర్లలో నితీశ్ రెడ్డి(29 నాటౌట్) సిక్సర్లతో రెచ్చిపోగా హైదరాబాద్ ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించి

# భారత్‌లో భానుడి భగభగలు..

**- ప్రపంచంలో టాప్-50 వేడి నగరాలు ఇక్కడే**

**-మధ్య భారత్‌లో వడగాలుల తీవ్రత ఎక్కువ**





**న్యూఢిల్లీ, మే 22:**

భారత్‌లో భానుడి ఉగ్ర రూపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం ఉదయం ఉష్ణోగ్రతలను లెక్కలోకి తీసుకుంటే..ప్రపంచంలోనే టాప్-50 అత్యంత వేడి నగరాలు మొత్తం భారత్‌లోనే ఉన్నాయి. ఒడిశాలోని బాలన్‌గిరిలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎయిర్‌క్వాలిటీ అండ్ వెదర్ ట్రాకర్ ఏక్యూల్.ఇన్ ఈ గణాంకాలను విడుదల చేసింది. శుక్రవారం ఉదయానికి మహారాష్ట్రలోని చంద్రాపుర్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.మధ్య భారత్‌లో వడగాలుల తీవ్రత ఎక్కువ
న్యూఢిల్లీ, మే 22: భారత్‌లో భానుడి ఉగ్ర రూపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం ఉదయం ఉష్ణోగ్రతలను లెక్కలోకి తీసుకుంటే..ప్రపంచంలోనే టాప్-50 అత్యంత వేడి నగరాలు మొత్తం భారత్‌లోనే ఉన్నాయి. ఒడిశాలోని బాలన్‌గిరిలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎయిర్‌క్వాలిటీ అండ్ వెదర్ ట్రాకర్ ఏక్యూల్.ఇన్ ఈ గణాంకాలను విడుదల చేసింది. శుక్రవారం ఉదయానికి మహారాష్ట్రలోని చంద్రాపుర్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# కండోమ్‌ల ఉత్పత్తిపై యుద్ధ ప్రభావం..

ధరలు పెరిగే అవకాశం!




న్యూఢిల్లీ
పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు చివరికి కండోమ్‌ల ఉత్పత్తులపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కండోమ్‌ల ప్రాథమిక నిర్మాణం సహజ రబ్బరు లాటెక్స్‌పై ఆధారపడినప్పటికీ, తుది ఉత్పత్తిని సిద్ధం చేయడానికి చమురు నుంచి సేకరించే మిశ్రమం ఎంతో అవసరం అవుతుంది. ముడి చమురు ధరలు పెరిగిన కారణంగా కండోమ్‌ల తయారీకి అవసరమైన లూబ్రికెంట్లు, సింథటిక్ రబ్బర్, స్టెబిలైజింగ్ కెమికల్స్ వ్యయం పెరుగుతున్నది.కండోమ్‌ల లూబ్రికేషన్ కోసం తయారీదారులు సిలికాన్ ఆయిల్‌పై, ప్యాకేజింగ్ కోసం అల్యూమినియం ఫాయిల్స్, ప్లాస్టిక్ ఫిల్మ్‌లపై అధికంగా ఆధారపడుతుంటారు. వీటి ధరలు పెరిగిన కారణంగా కండోమ్ ఉత్పత్తుల రిటైల్ ధరలను పెంచడం తప్పనిసరి అవుతున్నదని భారత్‌కు చెందిన హెల్త్‌కేర్ కంపెనీ 'మ్యాన్‌కైండ్ ఫార్మా' తెలిపింది. పెరిగిన ముడిసరుకు ఖర్చుల భారాన్ని వినియోగదారులపై మోపడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని కంపెనీ ప్రతినిధులు అంటున్నారు.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

మొదటి తరువాయి




కృతనిశ్చయంతో పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని అన్నారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయమని వివరించారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయమని చెప్పారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని అన్నారు. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయమని చెప్పారు. రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్నదని వివరించారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో మరింత సానుకూల దృక్పథంతో బ్యాంకులు ముందుకు రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై ప్రభుత్వం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని తెలిపారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధన రంగంపై దృష్టి సారిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలో స్థిరమైన ప్రగతి సాధిస్తోందని తెలిపారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని భట్టి సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని ఉపముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏయే రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యమని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి, ఉపాధికి ఏ రంగం ఎక్కువగా దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు.

## నేడు యాదగిరిగుట్టకు
# సీఎం రేవంత్



**హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాడు యాదగిరిగుట్టలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వేద పాఠశాలకు భూమిపూజ, లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరుతారు. అనంతరం 9:15 గంటలకు ప్రతిపాదిత వేద పాఠశాల స్థలానికి చేరుకుంటారు. 9:15 నుంచి 9:45 మధ్య వేద పాఠశాలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. సరిగ్గా ఉదయం 9:37 గంటలకు ఎస్ఎల్ఎన్ఎస్‌డీ వేద పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:50కు వేద పాఠశాల స్థలం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బయలుదేరుతారు రేవంత్ రెడ్డి. 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10:30 వరకూ స్వామివారిని దర్శించుకుంటారు. 10:30కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు బయలుదేరి 10:40కి అక్కడికి చేరుకుంటారు. దయం 10:40 నుంచి 11 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్రాంతి తీసుకుంటారు. 11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11:10కి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 11:15కు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

# రైతు గోస పట్టదా?

మొదటి తరువాయి

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సచివాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు ధర్నాకు దిగారు. సచివాలయం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కవిత, టీఆర్ఎస్ శ్రేణులు ధర్నాకు దిగడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు ధర్నా చేస్తున్న ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని అక్కడ నుండి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ లకు తరలించారు.

సర్కారుకు బుద్ధి రావాలని

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రైతుల గోస పట్టని సర్కారుకు బుద్ధి రావాలని సెక్రటేరియట్ ముందు నిరసన చేపట్టామన్నారు. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేసి వారికి బాసటగా నిలవాలన్న సోయి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేదంటూ ఫైర్ అయ్యారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మొక్కలు, పొద్దుతిరుగుడు పువ్వు, జొన్నలను ఆరబెడుతూ కాంటా వేసే వారి కోసం ఎదురు చూస్తున్నారని వివరించారు. తూకంలో తరుగు తీస్తున్నారు. తేమ పేరిట కొనుగోళ్లను ఆలస్యం చేస్తున్నారని కవిత మండిపడ్డారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ గా చెప్తూ రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. రెండున్నరేళ్లుగా వ్యవసాయ శాఖను సమీక్షించని సీఎం రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రమంటూ వ్యాఖ్యానించారు.. ఇప్పటికైనా ముఖ్యమంత్రి బుద్ధి తెచ్చుకుని ప్రత్యక్షంగా కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇవాళ సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి నిరసన తెలిపాం. ఇది శాంపిల్ మాత్రమే... వానలు పడే లోపే కొనుగోళ్లను పూర్తిచేయకపోతే... తెలంగాణ రక్షణ సేన రంగంలోకి దిగుతుందని, మీ మంత్రులు, ఎమ్మెల్యేలు తెలంగాణలో తిరగలేని పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

# గల్ఫ్‌లో ఉన్న వారి ఓట్లు పోకుండా చూస్తాం

మొదటి తరువాయి

నిర్వహించారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ఆయన దిశా నిర్దేశం చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం, సర్ అంశాలపైన పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా కేటీఆర్‌కు పార్టీ నాయకులు వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లా డుతూ జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన తెలంగాణ బిడ్డల ఓటు హక్కును కాపాడేందుకు పార్టీ తరఫున ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు చెప్పారు. త్వరలో రాష్ట్రంలో జరుగుతున్న సర్ విషయంలో లక్షలాది మంది తెలంగాణ ఎన్ఆర్ఐల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్నదని అన్నారు. ఈ విషయంలో గల్ఫ్ బాట పట్టిన తెలంగాణ బిడ్డల ఓటు హక్కులు తొలగించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని పార్టీ తరఫున కలుస్తామని వివరించారు. పార్టీ ప్రతినిధి బృందాన్ని, ఎమ్మెల్యేలు, ఎంపీల బృందాన్ని ఢిల్లీకి పంపనున్నట్టు చెప్పారు. సర్ కోసం నియమించిన బీఎల్ఏల ద్వారా గల్ఫ్ లోని తెలంగాణ బిడ్డల ఓటు హక్కును కాపాడేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వారికి కేటాయించిన బూత్ పరిధిలో గల్ఫ్ ఎన్ఆర్ఐల వివరాలు సేకరించి వారి ఓటు హక్కును ఎన్నికల కమిషన్ తొలగించకుండా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు.

# పెద్దల ఎన్నికకు..నగారా!

మొదటి తరువాయి

రాజ్యసభ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి.

**ఏపీలో నాలుగు స్థానాలకు...**

వాటితో పాటూ ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. జూన్ 21వ తేదీతో వైసీపీ నుంచి ఎంపికైన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో పాటు టీడీపీ నుంచి ఎంపికైన కనకమేడల రవీంద్రకుమార్ పదవీ కాలం ముగియనుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమిలోని పార్టీలకు 164 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. దాంతో ఈ నాలుగు రాజ్యసభ స్థానాలు కూటమి కైవసం చేసుకోనుంది.

# భారత్, సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

మొదటి తరువాయి

దాదాపు రెట్టింపు అయ్యాయని, ఇది ఇరుదేశాల మధ్య పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని నరేంద్ర మోడీ తెలిపారు. ఇటీవల భారత్- యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అనేది రాబోయే రోజుల్లో భారత్ - సైప్రస్‌కు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీని ఉద్దేశంతో రాబోయే ఐదేళ్లలో పెట్టుబడులను రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ఇరుదేశాలు పెట్టుకున్నాయని చెప్పారు.

ఈ విభాగాల్లో ఎంఓయూలు

భారత్, సైప్రస్‌ను డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్ నిర్వహక వ్యవస్థలు, రీసెర్చ్ హబ్స్ వంటి విభాగాలతో ముడిపడిన పలు అవగాహనా ఒప్పందాల(ఎంఓయూ)పై సంతకాలు చేశాయని ప్రధాని వెల్లడించారు. సాంస్కృతిక సహకారాలు, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడంపైన ఎంఓయూలు కుదిరాయన్నారు. ఇరుదేశాల మధ్య చట్టబద్ధమైన వలసలను ప్రోత్సహించే, అక్రమ వలసలను అరికట్టే ఒప్పందం భారత్‌కు దృఢమైన ఏకాభిప్రాయాన్ని సాధించడంపైన ఫోకస్ పెట్టాలని నిర్ణయించినట్టు మోడీ తెలిపారు. భారత్- సైప్రస్ మధ్య రాకపోకలు సాగించే వృత్తి నిపుణుల హక్కుల పరిరక్షణకు త్వరలోనే ఒక సామాజిక భద్రతా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించామన్నారు.

ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్

"ఉగ్రవాదం కట్టడి కోసం ఒక జాయింట్ వర్కింగ్ గ్రూపు ఏర్పాటు చేసే అంశంపై భారత్- సైప్రస్ మధ్య ఎంఓయూ కుదిరింది. తీవ్రవాద భావజాలం, సరిహద్దు ముప్పులను ఎదుర్కోవడానికి ఈ జాయింట్ వర్కింగ్ గ్రూప్ పనిచేస్తుంది. సైబర్ భద్రత, సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధక నెట్‌వర్కు బలోపేతం, రక్షిత రక్షణ విస్తరణలలోనూ ఇరుదేశాలు కలిసి పనిచేస్తాయి. భారత్, సైప్రస్ మధ్య స్నేహం బలమైనది. ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్నది. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన వంటి విలువలకు కట్టుబడి ఉండాలనే ఉమ్మడి నిబద్ధతపై మా భాగస్వామ్యం ఆధారపడి ఉంది. మేము అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ప్రధానంగా గౌరవిస్తాం. ఈ సూత్రాలను పరిరక్షించడానికి భారతదేశం కట్టుబడి ఉంది" అని ప్రధాని మోడీ తెలిపారు.

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

న్యూఢిల్లీ,



రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

## సంపాదకీయం

# భరోసా లేని బతుకు



'ఏద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు కన్నీరు పెట్టిన రాజ్యం" బాగుపడినట్టు చరిత్రలో లేదు. అదే చిత్రం ఇప్పుడు తెలంగాణలో ఆవిష్కృతమవుతోంది. రాష్ట్రాన్ని ఒకప్పుడు "రైతు రాజ్యం"గా ప్రచారం చేశారు. రైతు సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు, మద్దతు ధరలు, కొనుగోలు కేంద్రాల హామీలతో వ్యవసాయం బలపడిందని పాలకవర్గాలు చెప్పుకుంటున్నాయి. కానీ, క్షేత్రస్థాయిలో గ్రామీణ వాస్తవం అందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. దుక్కిదున్నిన రైతు చివరకు అప్పు తీర్చలేక, పండించిన పంట అమ్ముకోలేక, కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరిగి మనస్తాపంతో అదే దుక్కిలో ప్రాణాలు తీసుకుంటే -- అది రైతు వైఫల్యం కాదు, ముమ్మాటికీ ప్రభుత్వాలదే. ఇటీవల మెదక్ జిల్లాలో గాయంతి రాజయ్య అనే రైతు ఇరవై రోజులుగా కొను గోలు కేంద్రం వద్ద ధాన్యం అమ్మేందుకు ఎదురుచూసి, డబ్బులు రాక అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. సకాలంలో కొనుగోళ్లు జరిగి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. సిద్ధిపేట జిల్లా జగదేవ్‌పూర్ ప్రాంతంలో దిగుబడి సరిగా లేక అప్పుల భారంతో మరో రైతు ప్రాణాలు తీసుకున్నాడు. వికారాబాద్‌లో కూడా వ్యవసాయ నష్టాలు, అప్పులు రైతు ఆ కుటుం బాన్ని విషాదంలోకి నెట్టాయి? వీటన్నింటికి కారణాలను విశ్లేషిస్తే కనిపించేదొక్కటే- పాలకవర్గాల ప్రణాళిక లోపం, నిర్లక్ష్యం. పంటవేసిన నుంచి అప్పుల కుంపటి రైతుల నెత్తిన పడుతోంది. ఓవైపు కుటుంబ సమస్యలు, మరోవైపు ప్రకృతీ వైఫరీత్యాలు ఇవన్నీ కూడా రైతును నైరాశ్యంలో ముంచుతున్నాయి. పేర్లు ఏవైనా ఆదుకుంటుందని చెప్పిన రైతు బంధు, రైతు భరోసా వారికి భరోసా నివ్వడం లేదు. పైగా చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి వ్యాపారుల నుంచి వేధింపులు ఎక్కువవుతు న్నాయి. ఇవన్నీ రైతులను ఆత్మహత్యలవైపు నెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల విత్తనాలు, ఎరువులు, కూలి ఖర్చులు విపరీ తంగా పెరిగాయి. పంట చేతికొచ్చినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉండదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోతే రైతు మధ్యవర్తులపైనే ఆధారపడాల్సి వస్తోంది. సూర్యాపేట జిల్లాలో ధాన్యం కొనుగోలు అవకతవకలపై ఆందోళన చెందిన రైతు ఆత్మహత్యాయత్నం చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర సంగతి దేవుడెరుగు, కనీసం అమ్ముకోవడం కూడా గగనమైతే వారి పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలి? పంట కోసి నెలరోజులు దాటుతుంటే ఇప్పటి వరకు సగమే కొనుగోలు జరగడం, అధికార యంత్రాంగం అలసత్వాన్ని చూపుతోంది. ఒక దగ్గర గన్నీ సంచుల కొరత, మరోచోట కాంటాల సమస్య, లోడింగ్ బెడద. ఇవన్నీ సమకూర్చ వల్సింది సర్కారే కదా. రైతు నానా తిప్పలు పడి ఈ వేదన భరించలేక తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటున్న దయనీయ స్థితి నెలకొంది. ఎందుకంటే, కల్లాల్లో ధాన్యం ఆరబెట్టి ఉంటే అకాలంలో వర్షం వస్తే అసలుకు మోసం వస్తుంది. అందుకే గిట్టుబాటు ధర రాకున్నా నష్టానికి పంటలు అమ్ముకోవాల్సిన దుస్థితి ప్రభుత్వమే కల్పించింది. ఇంకొంతమంది రైతులు నేటికీ ధాన్యం కుప్పలపైనే పడిగాపులు కాయడం సర్కార్ నిర్లక్ష్య ధోరణే తప్ప వేరే కాదు. ఇన్ని సమస్యలు సవాల్ విసురుతుంటే, రైతులపై ప్రకృతి కూడా కనికరం చూపడం లేదు. అకాల వర్షాలు, వడగళ్ల వాన, పంట నష్టం వారిని మరింత కుంగదీస్తున్నాయి. నల్లగొండ, ఆదిలాబాద్ ప్రాంతాల్లో వర్షాల వల్ల ధాన్యం, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు నివేదికలు తెలిపాయి. పంటపోతే రైతుకు వెంటనే పరిహారం అందడం లేదు. పంట బీమా సకాలంలో రాదు. బీమా కంపెనీలను బతికించడానికే తప్ప రైతు కుటుంబాలను కాదన్న సత్యం రైతులకు ఎప్పుడో అర్థమైంది. కానీ, దాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో రైతు సొమ్ము కంపెనీల పరం అన్నట్టుగా ఉంది.

ప్రభుత్వం రైతు సంక్షేమంపై ప్రకటనలు చేస్తోంది. కానీ ఆచరణ కనుచూపు మేరలో లేదు. రైతు మరణించిన తర్వాత ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం సమస్యకు పరిష్కారం కాదు. అతను బతికుండగానే అప్పు ఒత్తిడి నుంచి బయటపడే విధానం కల్పించాలి. ధాన్యం కొనుగోలు ఆలస్యం కాకుండా చూడాలి. పంటకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధర, తక్షణ నష్టపరిహారం, తక్కువ వడ్డీ రుణాలు ఇవ్వాలి. అలాగే రైతులు మనోధైర్యం కోల్పోకుండా గ్రామ స్థాయిలో మానసిక ఆరోగ్య సలహా కేంద్రాలు నెలకొల్పాలి. కానీ, ఇవన్నీ చేయాల్సిన పాలకులు రైతు ఆత్మహత్యను "వ్యక్తిగత కారణం"గా కొట్టిపారేయడం అన్యాయం. ఒక రైతు అప్పుల బాధతో చనిపోతే, అందులో పాలనా నిర్లక్ష్యానికి వాటా కచ్చితంగా ఉంటుంది. ప్రభుత్వ వ్యవస్థ రైతును ఆదుకునే స్థితిలో ఉంటే, రైతు ఉరివేసు కోవాల్సిన పరిస్థితి రాదు. దీన్ని గుర్తెరగాలి. ఇది కేవలం రైతుల సమస్య కాదు. దేశ ఆహారభద్రతకు సంబంధించిన విషయం కూడా. రైతు బతికితేనే సమాజం బతుకుతుంది. కానీ పాలకులు ఎన్నికల సమయంలో మాత్రమే రైతును గుర్తు చేసుకుని, తర్వాత మరచిపోతున్నారు. రైతు చనిపోతే సంతాపం తెలపడం చాలా సులువు. కానీ రైతు ఎందుకు చనిపోతున్నాడో పాలకులు అంగీకరించని అంశం. తెలంగాణ అభివృద్ధి గణాంకాల్లో ఎంతో ఎదిగిందని ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు చెబుతున్నారు. కానీ పొలం దున్నిన రైతు తన పంట అమ్ము కోలేక చనిపోతే, ఆ అభివృద్ధి గణాంకాలు అర్థం లేనివే అవుతాయి. రైతు చనిపోతే అది కుటుంబం కోల్పోయిన జీవితం మాత్రమే కాదు -- సమాజం కోల్పోయిన ఆహార భద్రత కూడా.

# ఢిల్లీలో ఆటోలు, ట్యాక్సీల సమ్మె..

**-రూ.100కు చేరిన కొత్తిమీర..**

**- మండిపోతున్న కూరగాయల ధరలు**

**న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )**

దేశ రాజధాని ఢిల్లీలో ఎండలతోపాటు కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. ఆటోలు, ట్యాక్సీ వాలాలు సమ్మె చేస్తుండటంతో ఈ ప్రభావం కూరగాయలపై పడింది. గురువారం ప్రారంభమైన సమ్మె శుక్ర, శనివారాల్లో కూడా కొనసాగనుంది. ఇటీవల ఢిల్లీ ప్రభుత్వం కమర్షియల్ వాహనాలపై పర్యావరణ సెస్ పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని క్యాబ్‌లు, ఆటోలు, ట్రాలీ యాజమాన్యాలు బంద్ నిర్వహిస్తున్నారు. దీంతో రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఏకంగా హోల్‌సేల్ మార్కెట్లలోనే కూరగాయల ధరలు రెండు, మూడు రెట్లు పెరిగిపోయాయి. ఇంతకుముందు కొత్తిమీర కేజీ



రూ.40 ఉండగా, ఇప్పుడు అది రూ.100కు పైగా చేరింది. ఢిల్లీలోని పెద్ద మార్కెట్లలో ఒకటైన ఆజాద్‌పూర్ మండిలో కూడా కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. దీంతో ఢిల్లీ వాసులు కూరగాయలు కొనేందుకు జంకుతున్నారు. సామాన్యుల్ని ఈ ధరలు ఇబ్బంది పెడుతున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో కేజీ అల్లం రూ.130, కేజీ నిమ్మకాయలు రూ.100 పలుకుతున్నాయి. అయితే, ఎక్కువ రోజులు నిల్వ చేసుకోగలిగే ఉల్లి, ఆలూ, వెల్లుల్లి వంటి వాటి ధరలు స్వల్పంగా పెరిగినప్పటికీ అందుబాటులో ఉన్నాయి. సమ్మె కారణంగా మార్కెట్లో వీటి రాక కూడా తగ్గిపోయింది. ఇంకా ఒకట్రెండు రోజులకు సరిపడా మాత్రమే కూరగాయల నిల్వ ఉన్నాయని మార్కెట్ వ్యాపారులు చెబుతున్నారు. కూరగాయల ధరలతోపాటు ఢిల్లీ ప్రజలు రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఢిల్లీ ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ రవాణా సౌకర్యాలైన బస్సులు, మెట్రో, లోకల్ ట్రైన్లలోనే ప్రయాణిస్తున్నారు. దీంతో బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో విపరీత రద్దీ నెలకొంది.

# రూపాయి 100కు పడాల్సిందే..!

**డాలర్‌తో క్షీణించనివ్వండి**

**నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్**

**పనగారియా బాధ్యతా రహిత్య వ్యాఖ్యలపై విమర్శలు**

**న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )**

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజురోజుకు రికార్డ్ పతనాన్ని చూస్తోన్న వేళ నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగారియా రూపాయిని గాలికి వదిలేయండంటూ పరోక్షంగా అత్యంత బాధ్యతా రహిత్య వ్యాఖ్యలు చేశారు. డాలర్‌తో రూపాయి విలువ 100కు తగ్గాల్సిందేనన్నారు. చమురు కొరత స్వల్పకాలికమైనా, దీర్ఘకాలికమైనా రూపాయి విలువ పడేల్సిందేనని ఆర్‌బిఐ పలు సూచనలు చేయడం ఆర్థిక నిపుణులను ఆగ్రహానికి గురి చేస్తోంది. డాలర్‌కు రూ.100 అనేది కేవలం మానసిక భావనే అని పనాగరియా పేర్కొన్నారు. చమురు దిగుమతులు తగ్గగానే తిరిగి రూపాయి పుంజుకోవచ్చన్నారు. రూపాయి విలువ తగ్గితే



దిగుమతులకు అయ్యే ఖర్చు పెరగొచ్చని.. అదే సమయంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా రూపాయి విలువ తగ్గడం వల్ల కలిగే నష్టాన్ని భర్తీ చేయొచ్చని పనాగరియా ఎక్స్‌లో పోస్టు చేశారు. "ప్రస్తుత చమురు కొరత కొన్ని నెలల నుంచి ఒక ఏడాది వరకు కొనసాగితే రూపాయి మొదట్లో బలహీనపడుతుంది. కానీ పెట్టుబడిదారులు పెరగడం వల్ల భవిష్యత్తులో భారీగా కోలు కుంటుంది. ఈ చమురు సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే విదేశీ మారక నిల్వలను హరించివేస్తుంది. రూపాయి విలువ తగ్గింపు తప్ప మరే ఇతర మార్గాన్ని అనుసరించినా అది నష్టానికే దారితీస్తుంది. ఈ సమయంలో డాలర్లలో జారీ చేసిన సావరిన్ బాండ్లు లేదా అధిక వడ్డీ ఇచ్చే ఎన్నారై డాలర్ డిపాజిట్లపై ఎక్కువగా ఆధార పడకూడదు.' అని ఆర్‌బిఐకి16వ ఆర్థిక సంఘం చైర్మన్ గా పని చేసిన అరవింద్ పనాగరియా సూచించారు. 2013 నాటి కరెన్సీ సంక్షోభంతో పోలిస్తే ప్రస్తుతం భారతదేశ స్థూల ఆర్థిక పరిస్థితి చాలా బలంగా ఉందని చెప్పకొచ్చారు.

# త్రిభాషా సూత్రంపై సుప్రీంలో పిటిషన్

**న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )**

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడు భాషల బోధన (త్రిభాషా సూత్రం)ను తప్పనిసరి చేస్తూ తీసుకువచ్చిన నూతన విద్యా విధానం ఇప్పుడు న్యాయ వివాదానికి దారితీసింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరఫున దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. విద్యా సంవత్సరం మధ్యలో అకస్మాత్తుగా తొమ్మిదో తరగతి నుంచి మూడు భాషలను తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులపై తీవ్రమైన మానసిక, విద్యాపరమైన భారం పడుతుందని రోహత్గి కోర్టుకు వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానానికి ఇది పూర్తిగా భిన్నంగా ఉందని, దీనివల్ల అటు విద్యార్థుల్లో, ఇటు విద్యాసంస్థల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన న్యాయమూర్తికి వెల్లడించారు. విద్యార్థులు మూడు



భాషలు ఎలా నేర్చుకుంటారని, ఆ తర్వాత పదో తరగతి పరీక్షలు ఎలా రాస్తారని ఆయన కోర్టులో ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ జరపాలని ఆయన ధర్మాసనాన్ని అభ్యర్థించారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) సిఫారసుల మేరకు సీబీఎస్‌ఈ విద్యా చట్రంలో మార్పులు చేస్తూ 9, 10 తరగతుల్లో విద్యార్థులు కచ్చితంగా మూడు భాషలను చదవాలనే నిబంధనను తీసుకువచ్చింది. అయితే, తగిన ముందస్తు ప్రణాళిక లేకుండా, మధ్యలో ఈ నిబంధనను రుద్దడం సమంజసం కాదని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఈ వాదనలను పరిశీలించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వచ్చే వారం సమగ్ర విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది. త్రిభాషా విధానంపై సీబీఎస్‌ఈ ఇటీవలే నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయబోతున్నారు. ఇప్పటికే సీబీఎస్‌ఈ తరగతులు ప్రారంభమైనప్పటికీ.. జూలై 1 నుంచి మూడో భాష బోధన ప్రారంభం కానుంది. ఆర్1, ఆర్2, ఆర్3 కింద త్రిభాషను అమలు చేయనున్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ -- 2020, నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ -- 2022 ప్రకారం.. సీబీఎస్‌ఈ తాజా నిర్ణయం తీసుకుంది. మూడు భాషల్లో రెండు భారతీయ భాషలు తప్పనిసరిగా నేర్చుకోవాలి. మూడోది ఇండియన్ భాష అయినా ఉండొచ్చు.. లేదా విదేశీ భాష అయినా నేర్చుకోవచ్చు. త్రిభాషా విధానం కోసం సీబీఎస్‌ఈ మొత్తం 42 భాషల్ని ఎంపిక చేసి, వాటికి సంబంధించిన సిలబస్ రూపొందించింది. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పొందుపర్చిన భాషలు ఏవైనా నేర్చుకోవచ్చు. పదో తరగతిలో వచ్చే ఏడాది త్రిభాషా విధానం అమలు చేస్తారు. అయితే, దీనికి బోర్డ్ ఎగ్జామ్ మాత్రం నిర్వహించరు. ఇంటర్నల్ మార్కుల ఆధారంగా తుది మార్కుల జాబితాలో కలుపుతారు.

# నీట్ లీక్ బాధ్యత ఎవరిది?

**కేంద్రం, ఎన్‌టీఏ ?పరస్పర విరుద్ధ వాదనలు**

**లోపాన్ని ఒప్పుకున్న విద్యాశాఖ మంత్రి**

**సిస్టమ్ ద్వారా లీక్ జరగలేదన్న ఎన్‌టీఏ చీఫ్**

**వేర్వేరు ప్రకటనలతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం**

**న్యూఢిల్లీ మే 22 ( మహాప్రభ )**

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంపై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వాదనలు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి 'చైన్ ఆఫ్ కమాండ్‌లో లోపం జరిగిందని అంగీకరించగా.. ఎన్‌టీఏ డీజీ మాత్రం 'సిస్టమ్(వ్యవస్థ) ద్వారా ప్రశ్న పత్రం లీక్ కాలేదు' అని అంటున్నారు. ఇప్పుడు ఈ పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మరింత గందరగోళాన్ని పెంచుతున్నాయి. దీంతో లీక్ వ్యవ హారంలో అసలు బాధ్యత ఎవరిది? తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయ త్నాలను కేంద్రం, ఎన్‌టీఏలు చేస్తున్నాయా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నీట్ పరీక్ష? ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మక పరీక్ష?ను సమర్థవంతంగా నిర్వహించడంలో కేంద్రం విఫలమైందన్న విమర్శలు సర్వ త్రా వ్యక్తమయ్యాయి.




ఇలాంటి పరిస్థి తుల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సైతం తప్పును ఒప్పుకున్నారు. పరీక్ష? నిర్వహణ వ్యవస్థలో లోపం జరిగిందని అంగీకరించారు. అయితే ఎన్‌టీఏ వాదన మాత్రం ఇంకోలా ఉంది. ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ (డీజీ) అభిషేక్‌సింగ్ మాత్రం.. ప్రశ్నపత్రం వ్యవస్థ ద్వారా లీక్ కాలేదని ఈనెల 21న పార్లమెంటరీ కమిటీ ఎదుట చెప్పినట్టు వెల్లడి కావడం గమనార్హం. ?కొన్ని రోజుల క్రితం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ... నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో 'చైన్ ఆఫ్ కమాండ్‌లో లోపం జరిగింది' అని స్పష్టంగా చెప్పారు. ప్రభుత్వం దీనిపై బాధ్యత తీసుకుంటోందని కూడా ఆయన తెలిపారు. ఇక్కడే ఇటు ప్రభుత్వం, అటు ఎన్‌టీఏ నుంచి భిన్నవాదనలు వినబడటం అనేక అనుమానాలకు తావిస్తోంది. 'వ్యవస్థలో లోపం జరిగింది' అని ప్రభుత్వం చెప్తుంటే.. ఎన్‌టీఏ మాత్రం 'సిస్టమ్ ద్వారా లీక్ కాలేదు' అని ఎందుకు చెప్తోంది? అనే ప్రశ్న విద్యార్థులు, తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. సాధారణంగా 'సిస్టమ్' అంటే కేవలం కంప్యూటర్ సర్వర్ లేదా డిజిటల్ నెట్‌వర్క్ మాత్రమే కాదు. ప్రశ్నపత్రాల ముద్రణ, ప్యాకేజింగ్, రవాణా, భద్రపరిచే ప్రక్రియ, పరీక్షా కేంద్రాల నిర్వహణ, భద్రతా పర్యవేక్షణ... ఇవన్నీ కూడా పరీక్షా వ్యవస్థలో భాగమే. ఆ గొలుసు(చైన్)లో ఎక్కడైనా ప్రశ్నపత్రం బయటకు వెళ్తే, అది మొత్తం వ్యవస్థ వైఫల్యంగానే కనిపిస్తుందని విశ్లేషకులు చెప్తున్నారు. అయితే ఇప్పుడు జరుగుతున్న చర్చలో అసలు సమస్య సాంకేతిక పదజాలం కాదని అంటున్నారు. ప్రభుత్వం లోపాన్ని ఒప్పుకోగా.. ఎన్‌టీఏ మాత్రం 'లీక్' అనే పదాన్ని తప్పించు కుంటోందని చెప్తున్నారు. ?

# రైతుల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విపలం

**--బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్**




**దేవరకొండ మే 22 (మహాప్రభ )**
నియోజకవర్గంలోని పీఏ పల్లి మండలం అంగడి పేట గేట్ హైవే పై రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కేటిఆర్ ఆదేశానుసారం వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద ధర్న కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ అనంతరం వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతుల విషయంలో శాపంగా మారిందని ఆరుకాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు కోనె దిక్కు లేదన్నారు.రోజుల తరబడి వేచిచూసిన గాని కాంట వేసి లారిలల్లో మిల్లులకు తరలించే వారు లేరని రోజుల పాటు వడ్ల కుప్పల దగ్గర కాపల వుండాల్సి వస్థుందని .మరోపక్క కట్ షిట్ లేకుండా తాలు పేరిటి మిల్లర్ లతో కుమ్మకై నిలువు దోపిడి చేస్థున్నారు అని అన్నారు కేసిఆర్ హాయం లో రైతు ఆనందంగా వున్నారని మళ్లీ కేసిఆర్ రాక కోసం ఎదురు చూస్తున్నారు అని రైతు ఎడ్చిన రాజ్యం బాగుపడి నట్లు చరిత్ర లో లేదని మళ్ళి పోరపాటున కూడా కాంగ్రెస్ పార్టీ గెలవదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన అండగా వుంటుందని . వడ్లు కొనుగోలు చేసి లారిల కొరత తీర్చాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు . కేసిఆర్ రైతు బంధు, రైతు బీమా తో రైతులను ఆదుకున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవరకొండ నియెజక వర్గ సభ్యులు కేతావత్ భిల్యా నాయక్ అన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వల్లపు రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సరిత నర్సింహ,గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,ముత్యం రావు,తోట కూరి పరమేష్, మండల కార్యదర్శి మారుపాక జగన్,ఎర్ర యాదగిరి,చిలక మర్రి సర్పంచ్ దూదిపాల రాజెందర్ రెడ్డి,వడ్డి పట్ల సర్పంచ్ శ్రీను, సర్పంచ్ కిషన్ నాయక్, సర్పంచ్ ఆదేపు నాగేష్,మునగాల అంజి రెడ్డి,బోడ్డుపల్లి మహెందర్,కర్నాటి రవి,రమావత్ శ్రీను, హరి నాయక్, జైపాల్ నాయక్,మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బంజారా ఆరాధ్య దైవం శ్రీ మేరమ్మ యాడి దేవాలయ నిర్మాణానికి రూ.1,00,116 విరాళం

**- వడ్త్యా రమేష్**



**దేవరకొండ. డివిజన్ మే 22 ( మహాప్రభ )**
చందంపేట మండలం పోలేపల్లి మానవత్ తండాలో నూతనంగా నిర్మించనున్న బంజారా దైవం శ్రీ శ్రీ మేరమ్మ యాడి ఆలయాన్ని తండావాసుల, ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆలయాన్ని సందర్శించి ఆలయ నిర్మాణానికి తమ వంతు సహాయం కావాలని ఆలయ కమిటీ సభ్యులు, తండావాసులు బి.ఆర్.ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్యా రమేష్ నీ కోరగా తప్పకుండా నూతన ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా 1,00,116. రూపాయలు ఇస్తానని మాట ఇవ్వడం జరిగింది. అనంతరం తండావాసులు, ఆలయ కమిటీ సభ్యులు బి ఆర్ ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ గారిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాయి రాథోడ్, మానవత్ తండా సర్పంచ్ కవిత– హరియా నాయక్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పోలేపల్లి మాజీ సర్పంచ్ మహేష్, చందంపేట మాజీ జెడ్పిటిసి సలహాదారులు రామవతు మోహన్ కృష్ణ, ధర్మానాయక్, బాలు నాయక్, ఆలయ పూజారి తిరుపతి, వార్డ్ మెంబర్ సబిత, పత్య నాయక్, రాజు, మహేష్, శ్రీను నాయక్, శ్రీకాంత్, లక్ష్మణ్ నాయక్, వినోద్, హేమ్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ లో మహిళా ప్రసవం తల్లి బిడ్డ క్షేమం



**గాంధారి, మే 22(మహా ప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలం చద్మల్ తాండ మహిళ సంగీత కు పురిటినొప్పులు ఎక్కువ రావడం తో ఆశా వర్కర్స్, 108 సంప్రదించగా అంబులెన్సు వెంటనే పురిటి నొప్పులు ఎక్కువగా రావడంతో మార్గం మధ్యలోనే అంబులెన్సు లో నే నార్మల్ డెలివరీ చేసిన 108 సిబ్బంది శ్రీనివాస్, ఈ ఆర్ సి పి డాక్టర్ సారథి, సలహా తో మెరుగైన వైద్య ఆదిస్తూ సిహెచ్ సి హాస్పిటల్ కీ తీసుకువెళ్లారు. సంగీత కీ ఇది రెండవ కనుపూ అవ్వడం పాప పుట్టడం తో వారి కుటుంబ సభ్యులు అంబులెన్సు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తల్లి ని పుట్టిన పాప కీ వైద్య సేవలు ఇస్తూ సిహెచ్ సి గాంధారి హాస్పిటల్ కీ తీసుకెళ్లారు. తల్లి పిల్ల క్షేమంగా ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

## వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం.....



**శివంపేట మే 22 (మహాప్రభ):**
శివంపేట మండలంలోని చండీ గ్రామానికి చెందిన దొంతి బాలమణి అనారోగ్యం తో బాధపడుతున్న విషయం స్థానిక సర్పంచ్ గైనిబైటి ప్రవీణ్ గౌడ్ ద్వారా తెలుసుకున్న స్థానిక మాజీ జడ్పీటీసీ సభ్యులు పబ్బ మహేష్ గుప్తా వెంటనే స్పందించి 5 వేల రూపాయలు అందజేయ్యడం జరిగింది.ఈ రోజు గ్రామ కమిటీ అధ్యక్షులు ముత్యం రెడ్డి తో కలిసి స్థానిక సర్పంచ్ ప్రవీణ్ గౌడ్ బాధిత కుటుంబానికి అందజేయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ సౌజన్య నరేష్,వార్డ్ సభ్యులు సంధిల శ్రీనివాస్ గౌడ్, నర్సింగ్ అంజనేయులు, కర్రె వీరేష్, బంగారు గాని వెన్నెల నాగరాజు,నాయకులు ఏనుగు కృష్ణారెడ్డి,ఉప్పరి ప్రభు తదితరులు పాల్గొనడం జరిగింది.

## పర్యాటక శోభ సంతరించే విధంగా పటిష్ట చర్యలు కలెక్టర్ ప్రతిమా సింగ్..



**మెదక్ జిల్లా -22మే (మహాప్రభ )**
పర్యాటక వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం మెదక్ దాయార పురాతన కట్టడాలైన బావి, దేవాలయాలు సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ , అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు యువత,ఇతర ప్రజాప్రతినిధులు గ్రామస్తులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని పర్యాటక శోభ సంతరించే విధంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పర్యాటక ప్రాంతాలను తుది రూపు తీసుకువచ్చే విధంగా పర్యాటక పురావస్తు శాఖ అధికారుల సమన్వయంతో మౌలిక వసతులు కల్పనపై పటిష్ట చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.

## సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ చిత్రపటాలకు పాలాభిషేకం

**-కార్మికుల కనీస వేతనాల పెంపుపై హర్షాతిరేకాలు..**

**రామాయంపేటలో ఘనంగా కృతజ్ఞత సభ**



**రామాయంపేట మే 22 మహాప్రభ**
రాష్ట్రంలో ఒక కోటి 11 లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని హర్షం వ్యక్తం చేస్తూ ఈ చరిత్ర ఆత్మకు నిర్ణయానికి కృతజ్ఞతగా మున్సిపల్ కార్మికులు సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వెంకటస్వామి గారికి, ఎమ్మెల్యే రోహిత్ మదనపల్లి హనుమంతరావు గారి చిత్రపటాలకు పాలభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది . ఈ సందర్భంగా మున్సిపల్ ఏడో వార్డ్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజా ప్రభుత్వం ఎలక్షన్లు ఇచ్చిన వాగ్దానం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు తీసుకువెళుతుందని రైతుల నుండి చివరి గింజ ధాన్యాన్ని చివరి గింజల వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులు అధైర్య పడవద్దని చెప్పడం జరిగింది, ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి గారు తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ దేవుని రంజిత్ గారు మూడో వార్డ్ కౌన్సిల్ రవి గారు కో ఆప్షన్ సభ్యులు మరియు ఉపాధ్యాయులు చింతల యాదగిరి జిల్లా కార్యదర్శి పోచమ్మ గణేష్ గారు మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి గారు పట్టణ అధ్యక్షులు చింతల సప్న స్వామి గారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వామి గారు దేవుని నరసింహులు భూమా రమేష్ .అశోక్ గారు దేవుని రాజు , విప్లవ్ .దారం రమేష్ కుమార్ సాగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సమాజ సేవలు భాగంగా నూతన కమిటీ ఏర్పాటు

**-ఆర్గనేషన్లో చురుకైన పాత్ర పోషించడం, నూతన ఆల్ ఇండియాలో కమిటీ ఏర్పాటు**



**గాంధారి,మే 22 (మహా ప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలానికి చెందిన సోషల్ వర్కర్స్ స్వాన్ ఇండియా ఆర్గనైజేషన్లో చురుకైన పాత్ర పోషించడం అనాధ పిల్లలకు, వృద్దులకు వారి సేవలు గుర్తించి వారికి వసతులు కల్పించే, నూతన కమిటీగా గాంధారి మండలం స్వాన్ ఇండియా కమిటీ గా ఎన్నుకోవడం జరిగింది. స్వాన్ ఇండియా గాంధారి మండల అధ్యక్షులుగా దాసి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా వజీర్ వసంతరావు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బొమ్మని వంశీ, కాటేవాడి రమేష్ రావు, కార్యవర్గ సభ్యులుగా భూపతి, రమేష్, గోపి, నవనీత, రవళి, వంశీకృష్ణ, సంతోష్ లను ఎన్నుకోవడం జరిగింది. వీరికి స్వాన్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పీబీ సత్యం, నియామక పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్, వసంతరావు మాట్లాడుతూ.. మా సేవలు గుర్తించి మమ్మల్ని గాంధారి మండల బాధ్యులుగా డాక్టర్ పీబీ. సత్యం, కృతజ్ఞతలు తెలుపుతూ మండలంలోని సోషల్ వర్కర్ అభ్యున్నతికి ముందుండి ఉద్యమం చేస్తూ సమస్యల పరిష్కారానికి మా వంతు బాధ్యత నిర్వర్తిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## న్యూ కంబాల శివాలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 300 మందికి మజ్జిక పంపిణి.

**నల్లగొండ, మే 22 (మహా ప్రభ)**
నల్లగొండ పట్టణానికి చెందిన గొట్టముక్కుల బ్రహ్మాచారి పుట్టినరోజు సందర్భంగా న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కంబాల శివలీల రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రోజున క్లాక్ టవర్ సెంటర్లో 300 మందికిపైగా బాటసారులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఫౌండర్ డాక్టర్ కంబాల శివలీల మాట్లాడుతూ ఎండాకాలం(ఎండల తీవ్రత)అధికంగా ఉండటం వలన ప్రతి ఒక్కరు తమ ప్రత్యేకమైన రోజుల్లో మజ్జిగ,త్రాగునీరు పంపిణీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాగమణి వారి కుటుంబ సభ్యులు అన్నదమ్ములు,అక్క చెల్లెలు తదితరులు పాల్గొన్నారు...

## రైతుల కష్టాలు ప్రభుత్వంకు కనిపించడం లేదా

**-టిఎన్ రెడ్డి**



**దేవరకొండ మే 22 ( మహాప్రభ)**
రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు టి వి ఎన్ రెడ్డి అన్నారు.వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులపై దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పిలుపు మేరకు దేవరకొండ మండలం కమలాపురం కొనుగోలు కేంద్రం వద్ద బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... కళ్లాల్లో ధాన్యం కొనుగోలు చేయడం సరిగా లేకపోవడంతో రైతుల కళ్లల్లో కన్నీరు ఆగడం లేదని ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి రైతులను మోసం చేసిందని తెలిపారు.రైతు బతికితేనే రాష్ట్రం బతుకుతుందని అన్నారు.రైతు వ్యతిరేక పాలనకు ప్రజలే సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు.రైతుల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాశిరెడ్డి రవీందర్ రెడ్డి,రేపాని ఇద్దయ్య, జైహింద్ రెడ్డి,యాదయ్య, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు వైద్య సిబ్బందిచే స్క్రీనింగ్ పరీక్షలు

**-ఎస్సై మల్లికార్జున్ స్థానిక పోలీస్ స్టేషన్లో సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించారులి**




**మే 22 తిరుపతి జిల్లా (వరదయ్యపాలెం) మహాప్రభ**
తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ద్వైత ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఏఎన్ఏం లు పోలీసులకు ఎన్సిడి, సీడీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.. ఎస్సై మల్లికార్జున్, పోలీస్ కానిస్టేబుళ్లు కు బీపీ పరీక్షలు నిర్వహించి, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.. నిత్యం ప్రజాసమస్యలు ప్రజలరక్షణ భద్రతా సేవలతో మానసిక ఒత్తిడి, పని ఒత్తిడికి గురవుతున్న పోలీసుల ఆరోగ్య పరిరక్షణకు ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారి ద్వైత తెలిపారు కార్యక్రమంలో ాచీవీ లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి..



**నిడమనూర్, మే 22 (మహా ప్రభ)**
నిడమనూర్ మండల కేంద్రానికి చెందిన పిడుగు రాజు అనే వ్యక్తి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు వృత్తిరీత్యా లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, శుక్రవారం ఖాళీగా ఉండటంతో నిడమనూర్ చెరువు కింది భాగంలోని అలుగు కాలువ వద్ద చేపలు పడేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో కరెంట్ ఎర్త్ ద్వారా చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్ చేతికి తగలడంతో తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య సాయి ప్రియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు నిడమనూర్ ఎస్సై డి. విజయ్ కుమార్ తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కార్మికుల కళ నేర్చిన సందర్భంగా మెదక్ పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం.

-పట్టణ పార్టీ అధ్యక్షులు గంగాధర్.




**మెదక్ జిల్లా -22మే -(మహాప్రభ ).** శ్రమజీవులకు చేయూత వేతన సవరణ ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాలకు చేయూతనిస్తూ కార్మికుల పక్షాన కూడా శ్రమ దోపిడీ నరికట్టాలని స్థిరంగా 20వేల రూపాయలు వేతనం నిర్ధారించడం కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క కృత నిశ్చయం. శ్రమజీవులకు శ్రమకు తగ్గ ఫలితం లేకుండా దోపిడీదారుల వ్యవస్థలో నష్టపోయిన తెలంగాణ రాష్ట్ర కార్మిక లోకానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం భారతదేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా దేశానికే దిక్సూచిగా రాష్ట్ర నిలవడం హర్షించదగ్గ విషయం అని అన్నారు. కార్మికుల కల నెరవేర్చిన సందర్భంలో మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు. గౌరవనీయులు వివేక్ వెంకటస్వామి , మన మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవనీయులు. యంగ్ అండ్ డైనమిక్ లీడర్ డాక్టర్. మైనంపల్లి రోహిత్ చిత్రపటాలకు పాలాభిషేకం పట్టణ కాంగ్రెస్ పార్టీ తరఫున భారీ స్థాయిలో చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ ,, పట్టణ పార్టీ అధ్యక్షులు మందు గుల గంగాధర్, కానుగు భూపతి రాజు ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గూడూరి కృష్ణగౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్. రాగి అశోక్, కౌన్సిలర్లు గంట సంపత్ , తడుపునూరి శివరామకృష్ణ , గౌస్ కురేషి , ఎరుకల నరసింహులు సయ్యద్ ఉమర్, యువజన కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ సూఫీ మహిళా నాయకురాలు స్వరూప కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన గ్రామ యువత




**దేవరకొండ ( డివిజన్) 22మే (మహాప్రభ):** బొల్లనపల్లి రేషన్ డీలర్ నియామకాన్ని నిలిపివేయుట గురించి గురువారం వినతి పత్రం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో బొల్లనపల్లి గ్రామ యువకులు అందజేసి అనంతరం వారు మాట్లాడుతూ...ఇటీవల రేషన్ డీలర్ నోటిఫికేషన్ విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం నల్లగొండ జిల్లా ,(డిండి )గుండ్లపల్లి మండలం, బొల్లనపల్లి గ్రామపంచాయతీ కి సంబంధించిన రేషన్ డీలర్ నోటిఫికేషన్ విషయంలో సంబంధిత అధికారులు గ్రామంలో నోటిఫికేషన్ కు సంబంధించిన విషయాని ఎవరికి తెలియకుండా నిబంధనలకు విరుద్ధంగా అధికారులకు తెలిసిన వ్యక్తులకు చెప్పడం వలన గ్రామంలో చదువుకున్నటువంటి అర్హులైన చాలా మంది అప్లై చేసుకోలేకపోయారు ,నోటిఫికేషన్ కు సంబంధించిన విషయంలో గ్రామంలో డప్పు చాటింపు ద్వారా కానీ , వివిధ కూడలి ప్రదేశాలలో నోటిఫికేషన్ కు సంబంధించిన పత్రాలను అతికించథంకాని, గ్రామ పంచాయతీ కార్యాలయంలో లో నోటిఫికేషన్ కు సంబంధించిన పత్రాలను అతికించడం కానీ ఏది జరగకుండానే నిబంధనలకు విరుద్ధంగా అధికారులు వారికి తెలిసిన ఒక ప్రజా ప్రతినిధికి మాత్రమే తెలియజేశారు దీంతో వారు ఒక్కరే అప్లై చేసుకొని ఉన్నారు కావున ఈ నోటిఫికేషన్ ను రద్దు చేసి,నూతన నోటిఫికేషన్ ను విడుదల చేసి నియామకం పారదర్శకంగా జరిగేలా చూడగలరని గ్రామ యువత ప్రజలు డిమాండ్ చేశారు.

## ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి...



**పాపన్నపేట మే22(మహాప్రభ)** ఏడుపాయల చెక్ డ్యాం సమీపంలో ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు..సంగారెడ్డి జిల్లాలోని నవాబ్ పేట గ్రామానికి చెందిన కంకరి నాగరాజు(31)కు అపుడపుడు ఫిట్స్ వస్తుంది.అమ్మవారి దర్శనం కోసం శుక్రవారం ఉదయం ఏడుపాయలకు వచ్చాడు.ఏడుపాయల చెక్ డ్యాం సమీపంలో స్నానం చేయడానికి నీటిలోకి దిగాడు.నీటిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ నీట మునిగాడు.కాసేపటికి అటుగా వెళ్లిన స్థానికులు ఒడ్డుపై ఉన్న చెప్పులు, బట్టలు, ఫోన్ ను గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తండ్రి మానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## వేతన పెంపు హర్షణీయం : కాంగ్రెస్



**పాపన్నపేట, మే 22 ( మహా ప్రభ )** రాష్ట్రం లోని 1.11 కోట్ల మందికి పైగా కార్మికులకు మేలు జరిగేలా వేతనాల పెంపు నిర్ణయం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం పాపన్నపేట మండల కేంద్రం లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి,కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు,కార్మికులు,కాంగ్రెస్ నాయకులతో కలిసి మండలాధ్యక్షుడు పాలాభిషేకం చేశారు. మండల సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు .

# రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలి.

-ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలి.
-నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం.
-రేగోడ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్.




**మెదక్ జిల్లా -22మే (మహాప్రభ )** రేగోడ్ పోలీస్ స్టేషన్‌ను మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసు ఫైళ్లు, పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, దర్యాప్తు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామాల్లో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాలు, ప్రధాన కూడళ్లు, వాణిజ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పెంచాలని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ తనిఖీలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, రేణుక, సందీప్ రెడ్డి, ఏఎస్సై శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**దేవరకొండ మే 22 ( మహాప్రభ )** దేవరకొండ మండలం కొండ భీమనపల్లి గ్రామంలో దొంతునేని సంపతమ్మ ఫంక్షన్ హాల్ కొండ భీమనపల్లి గ్రామానికి చెందిన ఎర్ర విజయ్ కుమారుల నూతన పట్టు వస్త్రలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న.లిదేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ చిన్నారులను ఆశీర్వదించినారు. వారి వెంట రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ , మండల పార్టీ అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి , ఉప సర్పంచ్ కడారి సైదులు యాదవ్ , అప్పనాల తిరుమల్ , వేముల రాజు , ఇటికాల రాజు , గుండాల వెంకట్ యాదవ్, జబ్బుఉమ్మయ్య యాదవ్ , పొట్ట మురళి , రవీందర్ రెడ్డి , జక్కుల అంజి యాదవ్, రేపాని ఇద్దయ్య , యాదగిరి, హరికృష్ణ, బాలు, ఎర్ర కృష్ణ, ఎర్ర అశోక్, ముదిగొండ హరిదాస్, గుండాల శివ యాదవ్, గొట్టుముకుల శివ, భీఆర్ఎస్ నాయకులు, భీఆర్ఎస్ శ్రేణులు, పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో ఏసీబీ దాడులు..

-నర్సాపూర్ విద్యుత్ శాఖ ఏడి రమణారెడ్డి లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత




**నర్సాపూర్,మే, 22.(మహా ప్రభ)** మెదక్ జిల్లా నర్సాపూర్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సంచలన దాడులు నిర్వహించారు.మెదక్ జిల్లాలో వరుసగా వెలుగుచూస్తున్న అవినీతి ఘటనలు ప్రజల్లో ఆగ్రహం రేకెత్తిస్తున్నాయి. ప్రభుత్వ సేవలు పొందడానికి సామాన్యులు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి మారాలంటే ఇలాంటి అధికారులపై కఠిన చర్యలు తప్పనిసరి అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నర్సాపూర్ విద్యుత్ శాఖలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీ)గా విధులు నిర్వహిస్తున్న రమణారెడ్డి రూ.25 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. విద్యుత్ శాఖకు సంబంధించిన ఓ అధికారిక పనిని పూర్తి చేయడానికి ఫిర్యాదుదారుని నుంచి లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, ముందస్తు ప్రణాళిక ప్రకారం అధికారులు ఉచ్చుపన్ని నర్సాపూర్‌లోనే రమణారెడ్డిని పట్టుకున్నారు. లంచం స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన చేతులకు రసాయన పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు తెలిసింది.ఈ ఘటనతో విద్యుత్ శాఖలో కలకలం రేగింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం రమణారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

## హెల్త్ కేర్ సెంటర్ నామ మాత్రమే కనీస బోర్డు కూడా ఏర్పాటు చేయని వైనం

-హెల్త్ కేర్ సెంటర్లో మందు సీసాలు వాటితో పాటు సంచులు







**గాంధారి మే 22 (మహా ప్రభ)** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నేరల్ తండా హెల్త్ కేర్ సెంటర్ సాంక్షన్ అయ్యి సంవత్సరాలు గావస్తున్న ఇప్పటికీ పూర్తికాని వైనం అధికారులు నిర్లక్ష్యమా అక్కడున్న గ్రామంలో ఉన్న కొంతమంది లీడర్ల నిర్లక్ష్యమా అని ఆ గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ప్రశ్నిస్తున్నారు హెల్త్ కేర్ సెంటర్లో సంచులు అందులోనే సిట్టింగ్ రూమ్ అక్కడున్న లోకల్ రాజకీయ నాయకుల అండదండలతో వాడుకుంటున్నారని దీనిపట్ల తక్షణమే అధికారులు పరిష్కరిస్తే బాగుంటుందనీ నేరల్ తండా గ్రామస్తులు అంటున్నారు.

## తూప్రాన్ మున్సిపల్ కోఆప్షన్‌కు రెండు నామినేషన్ దాఖలు..

-కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు కోఆప్షన్ కు నామినేషన్లు



**తూప్రాన్ మే 22,(మహాప్రభ)** తూప్రాన్ మున్సిపాలిటీ కోఆప్షన్ ఎన్నికల కోసం శుక్రవారం తూప్రాన్ మాజీ మున్సిపల్ ఇంచార్జ్ చైర్మన్ నందాల శ్రీనివాస్, నాచారం దేవాలయ కమిటీ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లు రాముని గారి శ్రీశైలం గౌడ్ మామిడి వెంకటేష్ లు తూప్రాన్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులకు నామినేషన్ దాఖలు చేశారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్ రాముని గారి స్వప్న నాగరాజు గౌడ్ దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ..




**చౌటుప్పల్ మే 22 ( మహా ప్రభ )** కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు శాసనసభ్యుల గారి సిఫారసుతో మండలానికి మంజూరు అయిన రూపాయలు 80 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఈరోజు మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు బడుగు బలహీన వర్గాలకు ఆరోగ్యపరంగా వైద్య పరంగా ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక సామాజిక సంక్షేమ పథకాలను తీసుకొచ్చి తెలంగాణ ప్రజలకు ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి గారి నియంతృత్వంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి ఆదేశాల మేరకు పంపిణీ చేయడం జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరం టొ తు శ్రీనివాస్ నాయక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మందు గుల బాలకృష్ణ కరెంటో తు బిక్షపతి నాయక్ . కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కురుమిద్ద గోపాలు .చక్క స్వామి. బాలగోని మల్లేష్ గౌడ్ . ఈద శంకరయ్య. పాను గోతు బాలు నాయక్. వద్య శంకర్ నాయక్. సరిపల్లి సత్యనారాయణ. బద్దుల యాదగిరి. సిరి పంగి బాలకృష్ణ .కురుమిద్ద అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# బంగారం కొనేవారికి బిగ్ షాక్..

## -మళ్లీ పెరిగిన పసిడి ధరలు.. తులం ఎంతంటే?

పడిసి ప్రియులకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. గత కొన్నాళ్లు తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ పుంజుకున్నాయి. వరుసగా మూడోరోజు మళ్లీ బంగారం ధరలు పెరిగాయి. నిన్నటితో పోల్చుకుంటే శుక్రవారం ఉదయం 6 గంటల వరకు బంగారం, వెండి ధరల్లో భారీ మార్పులు చేసుకున్నాయి. దీంతో బంగారం కొనేవారు తీవ్ర నిరాశచెందుతున్నారు. ముందే ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఈ పెరుగుదల సామాన్యులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది.

బంగారం ధర కేవలం స్థానిక డిమాండ్‌పైనే కాకుండా అంతర్జాతీయ పరిణామాలపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ వాతావరణం, వివిధ దేశాల మధ్య ఉద్రిక్తతల వల్ల ఇన్వెస్టర్లలో ఆందోళన పెరిగింది. ఇలాంటి సమయాల్లో స్టాక్ మార్కెట్లు నష్టపోయే ప్రమాదం ఉండటంతో, సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు అందరూ మొగ్గు చూపుతున్నారు. దీని వల్ల డిమాండ్ పెరిగి ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. కాబట్టి



శుక్రవారం ఉదయం 6 గంటలకు దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,940గా ఉండగా 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,610 గా ఉంది. ఇక కేజీ వెండి ధర చూసుకుంటే రూ.2,85,100 వద్ద ట్రేడవుతుంది.

**దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం ధరలు**

హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,940 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,200 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

ఇక ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరరూ.1,59,940 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,940 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,61,680 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,110 వద్ద ట్రేడవుతోంది.

కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,940 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,940 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

# బెంజ్ నుంచి మరో మోడల్

## గరిష్ఠ ధర రూ.1.43 కోట్లు



**న్యూఢిల్లీ, మే 21**

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్.. దేశీయ మార్కెట్‌కు మరో మోడల్‌ను పరిచయం చేసింది. జీఎల్ఈ, జీఎల్ఎస్ నైట్ ఎడిషన్స్ విడుదల చేసిన ఈ కారు రూ.1.05 కోట్ల నుంచి రూ.1.43 కోట్ల లోపు లభించనున్నాయి. లిమిటెడ్ ఎడిషన్‌గా ప్రవేశపెట్టిన ఈ కార్లను టెక్నాలజీ పరంగా అప్‌గ్రేడ్ చేసి ప్రవేశపెట్టింది.వీటిలో నైట్ ఎడిషన్ జీఎల్ఎస్ 450 మాడల్ ధర రూ.1.41 కోట్లుగాను, నైట్ ఎడిషన్ జీఎల్ఎస్ 450 డీ మాడల్ ధర రూ.143 కోట్లు, నైట్ ఎడిషన్ జీఎల్ఈ 300డీ మాడల్ రూ.1.05 కోట్లు, నైట్ ఎడిషన్ జీఎల్ఈ 450 విలువ రూ.1.14 కోట్లుగా నిర్ణయించింది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

## ఆవిరైన ఇన్వెస్టర్ల సంపద



**హైదరాబాద్**

అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు, ముడిచమురు ధరల పెరుగుదల మరియు రూపాయి రికార్డు పతనం కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఆఖరి గంటలో చోటుచేసుకున్న భారీ అమ్మకాల ఒత్తిడితో ఆరంభ లాభాలు పూర్తిగా ఆవిరయ్యాయి.సెన్సెక్స్: 135 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ: కీలకమైన 24,000 మార్కు దిగువకు చేరింది.రూపాయి విలువ: డాలర్‌తో పోల్చితే ఎన్నడూ లేని విధంగా 96.50 స్థాయికి పడిపోయి ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేసింది.పతనానికి ప్రధాన కారణాలు:పశ్చిమాసియాలో (ఇరాన్ ఉద్రిక్తతలు) పెరుగుతున్న రాజకీయ అనిశ్చితి, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల హెచ్చుతగ్గులు మరియు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిరంతరాయంగా షేర్లను విక్రయించడం మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఐటీ మరియు ఎనర్జీ రంగాల షేర్లు భారీగా నష్టపోగా, బ్యాంకింగ్ రంగం మాత్రం స్వల్పంగా రాణించింది.

# ఐపిఎల్‌కు విజయ్ శంకర్ టాటా

# స్పోర్ట్స్

**ముంబై,**

:టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. దేశీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌కు కూడా వీడ్కోలు పలుకుతున్నట్లు శుక్రవారం అధికారికంగా ప్రకటించాడు. ఇన్నాళ్లు తనకు మద్దతుగా నిలిచిన బీసీసీఐ, ఫ్యాన్స్, భారత క్రికెట్ జట్టుకు ధన్యవాదాలు తెలిపాడు. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'క్రికెటే నా జీవితం. పదేళ్ల వయసులో మొదలైన క్రికెట్ ప్రయాణం 25 ఏళ్ల తర్వాత ఈ స్థాయికి చేరింది. టీమిండియాలో ఆడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలోనే అత్యంత గర్వకారణమైన క్షణం' అని పేర్కొన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో తమిళనాడు తరఫున విజయ్ శంకర్ అద్భుత ప్రదర్శన చేశాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌తో పాటు, మీడియం పేస్ బౌలింగ్‌తో జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. ఈ నిలకడైన ఆటతీరే అతడికి జాతీయ జట్టులో చోటు సంపాదించి పెట్టింది. 2018లో శ్రీలంకలో జరిగిన నిదహాస్ ట్రోఫీ ద్వారా అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేసిన శంకర్.. ఆ తర్వాత వన్డేల్లోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం




వహించాడు. విజయ్ శంకర్ తన క్రికెట్ కెరీర్‌లో 12 వన్డేలు, 9 టీ20 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించాడు. విజయ్ శంకర్ కెరీర్‌లో అత్యంత కీలకమైన ఘట్టం 2019 వన్డే ప్రపంచ కప్. అప్పట్లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అంబటి రాయుడును పక్కన పెట్టి మరీ సెలక్టర్లు విజయ్ శంకర్‌ను ప్రపంచ కప్ జట్టులోకి ఎంపిక చేశారు. ఆ సమయంలో చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్.. అతడిని 'త్రీ డైమెన్షనల్' ప్లేయర్‌గా అభివర్ణించాడు. అప్పట్లో ఆ మాట క్రీడా వర్గాల్లో పెద్ద సంచలనంగా మారింది. ఆ టోర్నీలో విజయ్ పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో వేసిన తొలి బంతికే వికెట్ తీసి రికార్డు సృష్టించాడు. అయితే ఆ తర్వాత కాలి వేలి గాయం కారణంగా టోర్నీ మధ్యలోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఆ తర్వాత జాతీయ జట్టులోనూ చోటు కోల్పోయాడు. ఐపీఎల్‌లో విజయ్ శంకర్ చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ముఖ్యంగా గుజరాత్ టైటాన్స్ జట్టు టైటిల్ గెలవడంలో, తర్వాతి సీజన్‌లో రన్నరప్‌గా నిలవడంలో విజయ్ శంకర్ కీలక పాత్ర పోషించాడు. ఆఖరిగా సీఎస్కే తరఫున ప్రాతినిధ్యం వహించాడు. కాగా ఈ సీజన్‌లో అతడిని ఎవరూ కొనుగోలు చేయలేదు. దేశీయ క్రికెట్‌లో కూడా విజయ్ శంకర్ ప్రదర్శన ఆకట్టుకునేలా సాగింది. 77 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 4,253 పరుగులు, 13 సెంచరీలు నమోదు చేయడంతో పాటు 43 వికెట్లు పడగొట్టాడు. లిస్ట్-ఏ, టీ20 ఫార్మాట్లలోనూ బ్యాట్, బంతితో తన ముద్ర వేశాడు. ఇప్పుడు అతని కొత్త ప్రయాణం ఎలా ఉండబోతోందో చూడాల్సి ఉంది.

# బీహార్‌కు ఓ జట్టు ఉండాల్సిందే

## వేదాంత ఛైర్మన్న అనిల్ అగర్వాల్




**పాట్నా,**

:ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాడు. బిహార్‌కు చెందిన ఈ 15 ఏళ్ల కుర్రాడు సంచలన ఆటతో ఆకట్టుకుంటున్నాడు. ఇలాంటి ఆటగాడు వచ్చిన బిహార్‌కూ ఓ ఐపీఎల్ జట్టు ఉండాలని బిలియనీర్ అనిల్ అగర్వాల్ వెల్లడించారు. భారత్‌లోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన వేదాంతా గ్రూప్‌నకు ఆయన ఛైర్మన్. పట్నాలో 1954లో ఆయన జన్మించారు. సోషల్ మీడియా వేదికగా ఓ పోస్టు వైరల్‌గా మారింది. బిహార్ నుంచి అద్భుతమైన క్రికెటర్లు వస్తున్నారని అందులో పేర్కొన్నారు. 'ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మాదిరిగా బిహార్ కూడా అద్భుతమైన జట్టును కలిగి ఉండటానికి అర్హత ఉందని మీకు అనిపించడం లేదా? బిహార్ గడ్డ ఎంతో మంది నాణ్యమైన క్రికెటర్లను దేశానికి అందించింది. పట్నాలో జన్మించిన ఇషాన్ కిషన్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించాడు. సమస్తిపుర్ నుంచి వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ అరంగేట్రంలోనే రికార్డులు సృష్టించాడు. సకిబ్ హుస్సేన్ (ఎస్ఆర్‌హెచ్) గోపాల్‌గంజ్‌లోని ఓ సాధారణ కుటుంబానికి చెందిన ప్లేయర్. ఇలాంటివన్నీ చూసినప్పుడు నాకు ఒకటే అనిపించేది. ఎందుకు క్రికెట్‌లో బిహార్‌కు గుర్తింపు రావడం లేదు? బిహార్ యువత ప్రతి రంగంలోనూ రాణించేలా అవకాశాలు కల్పించడం. మన క్రీడాకారులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహం అందించేలా చేయడం నా చిరకాల స్వప్నం. బిహార్ నుంచి వచ్చే జట్టు ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా నిలుస్తుందన్న పూర్తి విశ్వాసం నాకుంది' అని అనిల్ అగర్వాల్ పోస్టు పెట్టారు. నాలుగేళ్ల కిందట రెండు ఫ్రాంచైజీలు అదనంగా వచ్చిన సంగతి తెలిసిందే. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ అడుగు పెట్టాయి. ఇప్పటికే ఐపీఎల్ మార్కెట్ విలువ భారీగా ఉంది. దీంతో కొత్త ఫ్రాంచైజీలకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లూ వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఒకటి, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల నుంచి ఒక ఫ్రాంచైజీకి అనుమతి ఇవ్వాలని పలువురు కోరారు. ఇప్పుడు బిహార్‌కు చెందిన బిలియనీర్ నేరుగా రంగంలోకి దిగడంతో ఐపీఎల్ మేనేజ్‌మెంట్ ఏం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఐపీఎల్‌లో 'ధోనీ స్కామ్'..

## అభిమానులను పిచ్చోళ్లను చేసిన సీఎస్కే..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఎంఎస్ ధోనీ ఆటకోసం నిరీక్షించిన అభిమానులకు నిరాశే మిగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో ధోనీ ఆడుతాడనే ఆశ కూడా ఆవిరైంది. అయితే.. సీజన్ ఆసాంతం మహా భాయ్ ఫిట్‌నెస్‌పై, 'ఇదుగో వస్తుండు.. వచ్చే మ్యాచ్‌లో ఆడే అవకాశముంది' అని అభిమానులను మభ్యపెట్టిన సీఎస్కే యామజమాన్యంపై మాజీ ఆటగాడు క్రిష్ణమాచారి శ్రీకాంత్ మండిపడ్డాడు. పంతొమ్మిదో సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ధోనీ స్కామ్‌కు తెర తీసిందని ఆయన తీవ్రంగా విమర్శించాడు.లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఒక్కటంటే ఒక్క మ్యాచ్ ఆడలేదు. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ త్వరలోనే ఫిట్‌నెస్ సాధిస్తాడని, లీగ్ దశ చివర్లో ఆడుతాడని చెన్నై సూపర్ కింగ్స్



చెబుతూ వచ్చారు. మొదట కాలి గాయంతో ధోనీ బాధ పడుతున్నాడని, అతడు త్వరలోనే జట్టుతో కలవాలని కోరుకుంటున్నామని చెప్పారు. ధోనీ తర్వాతి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని చెపాక్‌లో చివరి మ్యాచ్ టాస్ సందర్భంగా గైక్వాడ్ తెలిపాడు. ఆ మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో ధోనీ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను సీఎస్కే తమ ఎక్స్ ఖాతాలో కెప్టెన్, కోచ్ చెప్పిన మాటలన్నీ అబద్ధాలని అభిమానులు గ్రహించారు. ఈ విషయంపై మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్ స్పందిస్తూ 'ధోనీ స్కామ్'కు సీఎస్కే తెర తీసిందని విమర్శించాడు.'సీజన్ ఆరంభం నుంచి ధోనీ గురించి కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌లు ప్రతిసారి అబద్ధాలు పెట్టింది. దాంతో, తాలా కచ్చితంగా సన్‌రైజర్స్‌తో ఆడుతాడని అభిమానులు గంపెడు ఆశలతో మైదానానికి పోటెత్తారు. కానీ, మళ్లీ వారికి నిరాశే మిగిలింది' అని శ్రీకాంత్ యూట్యూబ్ ఛానెల్లో ఆగ్రహం వ్యక్తం చేశాడు.

# పెద్ది నుండి స్పెషల్ సాంగ్ హెల్లల్లలో ప్రోమో విడుదల ..

## ఫ్యాన్స్ ఫుల్ ఖుష్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' పై రోజురోజుకీ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ క్రీడా ప్రధాన కథా చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. రేపు భోపాల్‌లో భారీ స్థాయిలో సంగీత వేడుక జరగనున్న నేపథ్యంలో చిత్రబృందం అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం "హెల్లల్లలో" అనే పాటకి సంబంధించిన ప్రోమో విడుదల చేశారు. ఇందులో రామ్ చరణ్, శృతి హాసన్ స్టెప్పులకి ఫ్యాన్స్‌కి మాంచి కిక్ ఇచ్చాయి. ఫుల్ సాంగ్ మార్చి 23న రానుంది.ఈ పాటకు ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని సమకూర్చారు. ఆయన సంగీతం అంటేనే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. అందులోనూ ఇది ప్రత్యేక గీతం కావడంతో ఈ పాటపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రేపు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పాటలో ఇంకో కథానాయిక కూడా కనిపించనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చ నడుస్తోంది. అయితే ఆమె ఎవరు అన్న విషయం మాత్రం చిత్రబృందం ఇంకా రహస్యంగానే ఉంచింది. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం ఇప్పుడు ప్రత్యేక గీతం వార్తతో మరింత చర్చనీయాంశంగా మారింది.



## గ్లామర్ డోస్ పెంచిన మిరాయి బ్యూటీ..

# వినాయక చవితికి జైలర్-2 ?




'టైగర్ కా హుకుం'.. అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోమారు బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు రజనీకాంత్. ఆయన 'జైలర్'లో ఇదే పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విజయవంతమైన సినిమాకి కొనసాగింపుగా 'జైలర్ 2' సిద్ధమైంది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు రెండో వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసం రెండు తేదీల్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తిక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.



# కోలీవుడ్‌లోకి జాన్వీ కపూర్ గ్రాండ్ ఎంట్రీ ..

## -యువ హీరోతో జత కట్టడంపై భారీ బజ్!

బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటి జాన్వీ కపూర్ ఇప్పుడు దక్షిణాది చిత్రసీమలో తన ప్రస్థానాన్ని మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దివంగత అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన జాన్వీ, ఇప్పటికే టాలీవుడ్‌లో దేవర, పెద్ది సినిమాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇప్పుడు ఆమె తమిళ చిత్రసీమలోకి అడుగుపెట్టబోతున్నారనే వార్త సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.తాజా సమాచారం ప్రకారం, విలక్షణ నటుడు విక్రమ్ కుమారుడు, యువ హీరో ధృవ్ విక్రమ్ సరసన జాన్వీ నటించే అవకాశం ఉన్నట్లు కోలీవుడ్‌లో బలమైన ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరు స్టార్ కిడ్స్ తొలిసారి ఒకే చిత్రంలో జంటగా కనిపించబోతుండటంతో ప్రాజెక్ట్‌పై అంచనాలు పెరుగుతున్నాయి.ధ్రువ్ విక్రమ్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన తదుపరి చిత్రాన్ని యువ దర్శకుడు గణేష్ కే బాబు తెరకెక్కించనున్నట్లు సమాచారం. గతంలో యూత్‌కు బాగా కనెక్ట్ అయిన రొమాంటిక్ కథలతో ఆకట్టుకున్న దర్శకుడు, ఈసారి కూడా ప్రేమ, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలను కలిపిన ఒక యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కథను నేటి యువతకు దగ్గరయ్యేలా రూపొందిస్తున్నారని, ఇందులో ప్రేమకథతో పాటు బలమైన భావోద్వేగ అంశాలు కూడా ఉండనున్నాయని టాక్ వినిపిస్తోంది. జాన్వీ గ్లామర్ ఇమేజ్‌తో పాటు ధ్రువ్ నటన శైలిని దృష్టిలో పెట్టుకుని కథను డిజైన్ చేసినట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అలాగే ఈ చిత్రానికి భారీ నిర్మాణ విలువలు ఉండనున్నాయని సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను గ్రాండ్ స్కేల్‌లో నిర్మించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. విజువల్స్, మ్యూజిక్, టెక్నికల్ అంశాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా సినిమాను రూపొందించాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని టాక్.ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. స్క్రిప్ట్ ఫైనలైజేషన్, లొకేషన్ ఎంపిక వంటి పనులు చివరి దశకు చేరుకున్నాయని సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా ఆసక్తికర అంశం ఏమిటంటే.. ఈ సినిమాను కేవలం తమిళ భాషకే పరిమితం చేయకుండా మల్టీ-లాంగ్వేజ్ విడుదల దిశగా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లో కూడా ఒకేసారి విడుదల చేసే అవకాశాలను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యారాయ్



సందడిగా జరిగే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యారాయ్ ఎప్పుడూ హైలైట్‌గా నిలుస్తుంటారు. అయితే ఈసారి ఆమె ఈ వేడుకకు హాజరుకావడం లేదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. వీటికి చెక్ పెడుతూ ఈ బ్యూటీ తన కుమార్తెతో కలిసి ఫ్రాన్స్‌కు బయల్దేరారు. దీంతో కేన్స్‌లో చివరిరోజు ఐశ్వర్య సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. ఒక ప్రముఖ బ్రాండ్ తరఫున ప్రతి ఏటా కేన్స్ రెడ్ కార్పెట్‌పై హొయలొలికించే ఐశ్వర్య ఈసారి ప్రచార చిత్రాల్లో కనిపించకపోవడంతో రూమర్స్ మొదలయ్యాయి. ఆమెకు బదులుగా ఈసారి బాలీవుడ్ నటి అలియా వెళ్లారంటూ కథనాలు వచ్చాయి. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా ఆమె ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో వాళ్లు సంబరపడుతున్నారు. ఈసారి ఈ కేన్స్ క్వీన్ ఎలాంటి లుక్స్‌తో మెస్మరైజ్ చేయనున్నారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటిసారి 2002లో కేన్స్‌కు వెళ్లిన ఐష్.. అప్పటినుంచి ప్రతి ఏడాది తన ప్రత్యేకమైన దుస్తులతో మెరుస్తూనే ఉన్నారు. గతేడాది కూడా భారతీయత ఉట్టిపడేలా చీరతో వచ్చిన ఆమె.. నుదుటిన సింధూరంతో అందరి దృష్టిని ఆకర్షించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు కేన్స్ వేదికగా తన లుక్‌తో మద్దతు ఇచ్చి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు.

# విజయాన్ని శాసించేది ఆ మూడు మాత్రమే



నెపోటిజం గురించి చాలామంది స్టార్‌కిడ్స్ చాలా సందర్భాల్లో మాట్లాడారు. తాజాగా మహేశ్ మంజ్రేకర్ ముద్దుల తనయ సాయి మంజ్రేకర్ కూడా ఈ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. సినీ పరిశ్రమలో నటవారసత్వం అనే అంశంపై ఇటీవల ఆమె మాట్లాడుతూ 'ఇంటిపేరనేది బలమైన కెరీర్‌కి గ్యారెంటీ కార్డు కాదు. అది కేవలం ప్రారంభంలో పరిచయాలకూ, తొలి సినిమా అవకాశానికి మాత్రమే సహాయపడుతుంది.జనానికి కనెక్ట్ కానప్పుడు, ఎంతటి సూపర్‌స్టార్ వారసులైనా తలదించుకొని వెనక్కెళ్లిపోవాల్సిందే. అందుకే 'మంజ్రేకర్' అనే కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి, కేవలం నా కష్టం, అంకితభావంతో ఇండస్ట్రీలో నిలబడాలనుకుంటున్నా. హార్డ్‌వర్క్, క్రమశిక్షణ, పట్టుదల.. ఈ మూడు మాత్రమే విజయాన్ని శాసిస్తాయి' అని సాయి మంజ్రేకర్ పేర్కొన్నది. 'మేజర్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన సాయి మంజ్రేకర్.. ప్రస్తుతం తెలుగు చారిత్రాత్మక పానిండియా చిత్రం 'ఇండియా హౌస్'లో కథానాయికగా నటిస్తున్నది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com